



నదిలో ఇరుక్కున్న పడవలను సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న రెస్క్యూ బృందాలు

హమ్మయ్యా.. ఉత్కంఠ వీడింది!

- సురక్షిత ప్రాంతానికి డ్రెడ్జింగ్ పడవలు
- ఏజెన్సీ అవగాహన లోపం.. అధికారుల నిర్లక్ష్యం
- జిరాపేరులో వరద ఉధృతికి కొట్టుకొచ్చిన పడవలు
- సంగం బ్యారేజీకి తప్పిన ముప్పు
- ఇటు యంత్రాంగం, అటు రైతాంగంలో హైటెన్షన్
- మంత్రులు లోకేష్, అనిత అభినందనలు

8





నెల్లూరు : మూలస్థానేశ్వరుడి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కోరం లేక జడ్పీ సమావేశం వాయిదా

నెల్లూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం కోరం లేని కారణంగా వాయిదా పడింది. చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన గురువారం సమావేశం జరగాలని ముందుగా నిర్ణయించారు. అయితే మొంథా తుఫాన్ నేపథ్యం, ఆగ్రోస్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు ఉత్తరక్రియలు ఉండడంతో సభ్యులు సమావేశానికి హాజరుకాలేదు. ఉదయం 10.30 గంటలకు జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమావేశానికి విచ్చేశారు. అప్పటికి ఇద్దరు జడ్పీటీసీ సభ్యులు మాత్రమే హాజరయ్యారు. సమావేశం నిర్వహణకు కోరం సరిపోకపోవడంతో గంటపాటు చైర్‌పర్సన్ వాయిదా వేశారు. ఆ తర్వాతికి ఆరుగురు మాత్రమే హాజరయ్యారు. అప్పటికీ సరిపడా కోరం లేకపోవడంతో నిబంధనల ప్రకారం సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు అరుణమ్మ ప్రకటించారు. తదుపరి సమావేశం ఎప్పుడు నిర్వహించాలన్నది సభ్యులు, అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆమె తెలిపారు. కాగా సర్వసభ్య సమావేశం సందర్భంగా జడ్పీ అధికారులు తయారు చేసిన అజెండా వివాదంగా మారింది. ఈ సమావేశానికి శాశ్వత ఆహ్వానితుల జాబితాలో జిల్లా పాల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య అధ్యక్షుడు కొండ్రెడ్డి రంగారెడ్డి పేరును చేర్చారు. అయితే రంగారెడ్డి పదవీ కాలం గత నెలాఖరుతోనే ముగిసింది. అయినా దానిని పట్టించుకోకుండా ఇంకా రంగారెడ్డికి ఆహ్వానం పంపడంపై చర్చనీయాంశంగా మారింది.

కోటి దండాలు స్వామీ..!

- భక్తిశ్రద్ధలతో కోటి సోమవారం
- హరిహర క్షేత్రాల్లో సందడి

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కోటి సోమవారం పర్వదినాన్ని గురువారం జిల్లా ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువ జామునే నదీ, సముద్ర స్నానాలు ఆచరించి శివాలయాల్లో అభిషేకాలకు బారులుతీరారు. ముక్కంటికి ఉదయం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, బల్వార్చనలు, విశేష పూజలు జరిగాయి. ప్రదోష సమయంలోనూ అభిషేకాలు జరిపారు. భక్తుల హరనామ స్మరణతో ఆలయాలు మారుమోగాయి. కొందరు భక్తులు ఉపవాస దీక్ష చేపట్టి సాయంత్రం కార్తీక దీపాలు వెలిగించి సర్వేశ్వరుడిని దర్శించుకుని దీక్షను విరమించారు. శైవ క్షేత్రాల్లో రాత్రి ఆకాశ దీపోత్సవాలు, కుంభహారతులు, ప్రాకారోత్సవాలు కనుల పండువగా జరిగాయి. అదేవిధంగా శ్రవణ నక్షత్రం సందర్భంగా వైష్ణవ ఆలయాల్లో ఉత్సవాలు జరిగాయి. పెంచలకోన, వేదగిరి లక్ష్మీనరసింహస్వామి, మాగుంటలేఅవుట్ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో శ్రీవారికి విశేష అభిషేకాలు, తులసీదళ అర్చనలు, ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులతో ఆలయాలు కిట కిటలాడాయి.

యథాతథంగానే..

- గూడూరు నెల్లూరుకు.. కందుకూరు ప్రకాశంకు..
- రూపుమారనున్న నెల్లూరు జిల్లా
- ఒకే రెవెన్యూ డివిజన్ కిందకు ఉదయగిరి
- నెరవేరనున్న స్థానికుల ఆశలు
- ప్రజల అభీష్టానికి సీఎం చంద్రబాబు పెద్దపీట

గూడూరు.. నెల్లూరు జిల్లాలోనూ.. కందుకూరు... ప్రకాశం జిల్లాలోనూ కలవబోతున్నాయా!? అక్కడి ప్రజల కల నెరవేరనుందా!? జిల్లాల పునర్వ్యవస్థీకరణ క్రమంలో రాజధాని కేంద్రంగా జరుగుతున్న పరిణామాలను గమనిస్తే... ఇది నిజమేనని అనిపిస్తోంది. గూడూరు, కందుకూరు నియోజకవర్గాల ప్రజల చిరకాల వాంఛ నెరవేరబోయే రోజులు దగ్గర్లోనే ఉన్నట్లు రాజకీయ వర్గాల సమాచారం. అలాగే మూడు రెవెన్యూ డివిజన్ల కింద మగ్గుతున్న ఉదయగిరి నియోజకవర్గం ప్రత్యేక రెవెన్యూ డివిజన్‌గా రూపాంతరం చెందనుంది.

నెల్లూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో ఏర్పడిన కొత్త జిల్లాల కారణంగా గూడూరు, కందుకూరు నియోజకవర్గాలు తీవ్రంగా ఇబ్బందిపడ్డాయి. పార్లమెంట్ నియోజకవర్గం ప్రామాణికంగా కొత్త జిల్లాలు ఏర్పాటు చేయడంతో గూడూరు తిరుపతి జిల్లాకు, ప్రకాశం జిల్లాలోని కందుకూరు నెల్లూరు జిల్లాలో కలిశాయి. దీంతో ఈ రెండు నియోజకవర్గాల ప్రజలకు జిల్లా కేంద్రాలు దూరం అయ్యాయి. కందుకూరు నుంచి ఒంగోలుకు 45 కిలోమీటర్లు. అదే కందుకూరు నుంచి నెల్లూరుకి 120 కిలోమీటర్లు. జిల్లా కేంద్రం మారడంతో ఆ ప్రాంత ప్రజలు జిల్లా కేంద్రానికి రావాలంటే దూరం మూడు రెట్లు పెరిగింది.

- ఇక గూడూరు విషయానికి వస్తే ప్రస్తుత జిల్లా కేంద్రమైన తిరుపతికి 112 కిలోమీటర్లు. ఇదే నియోజకవర్గంలోని కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు అయితే మరో 20 కిలోమీటర్లు అదనంగా పెరుగుతుంది. అదే నెల్లూరుకు అయితే కేవలం 40 కిలోమీటర్లే. నియోజకవర్గంలోని ఏ మండల కేంద్రం నుంచి అయినా నెల్లూరుకు పట్టే ప్రయాణ సమయం 30 నుంచి 45 నిమిషాలు మాత్రమే. కొత్త జిల్లాల ఏర్పాటుతో కందుకూరు, గూడూరు వాసులకు రవాణా ఖర్చులు పెరగడంతోపాటు ప్రయాణ సమయం కూడా పెరిగిపోయింది.

● అధికారులకు రోజంతా పని

ఈ ప్రాంతాల నుంచి మండల అధికారులు ఏదైనా సమీక్షకు జిల్లా కేంద్రానికి వెళ్లి రావాలంటే ఒక రోజు పని. అదే పాత జిల్లాలు అయితే మధ్యాహ్నానికి పనిచేసే ప్రాంతాలకు చేరుకునేవారు. పైగా ఈ రెండు నియోజకవర్గాలకు అనాదిగా పాత జిల్లా కేంద్రాలతోనే మానవ సంబంధాలు ఎక్కువ. గూడూరు ప్రజలకు నెల్లూరు, కందుకూరు ప్రజలకు ఒంగోలుతో ఉన్న అవినాభావ సంబంధాలు, కొత్త జిల్లా కేంద్రాలతో లేవు.

● ఆ 3 మండలాల పరిస్థితి ఏమిటి?

వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని సైదాపురం, రాపూరు, కలువాయి మండలాల పరిస్థితి ఏమిటనే విషయం అంతుపట్టడం లేదు. ప్రస్తుతం ఈ మూడు మండలాలు నెల్లూరు జిల్లాలో ఉన్నాయి. వైసీపీ హయాంలో వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని అన్నీ మండలాలను తిరుపతి జిల్లాలో విలీనం చేయగా, అప్పటి వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి పట్టుబట్టి ఈ మూడు మండలాలను నెల్లూరు జిల్లాలోనే కొనసాగేలా మార్పు చేయించారు. ఈ మండల ప్రజలకు తిరుపతి చాలా దూరం అవుతుందని, తిరుపతి జిల్లాలో విలీనం చేస్తే రెవెన్యూ పరంగా కూడా చిక్కులు ఎదురవుతాయని ఆనం అప్పటి జగన్ ప్రభుత్వాన్ని ఒప్పించి ఈ మూడు మండలాలను నెల్లూరులోనే కొనసాగేలా చేశారు. ఇప్పుడు ఈ మూడు మండలాలు నెల్లూరు జిల్లాలోనే ఉంటాయా!? లేదా తిరుపతి జిల్లాలో కలుస్తాయా!? అనే విషయం అంతుపట్టడం లేదు.

మాట ఇచ్చిన చంద్రబాబు, లోకేష్

ఎన్నికల ప్రచారాల సందర్భంగా గూడూరు, కందుకూరు ప్రాంతాలకు వచ్చిన చంద్రబాబు ఆ రెండు నియోజకవర్గాల ప్రజల కష్టాలను గమనించారు. టీడీపీ అధికారంలోకి వస్తే గూడూరును నెల్లూరు జిల్లాలోనూ, కందుకూరును ప్రకాశం జిల్లాలోనూ కలుపుతామని హామీ ఇచ్చారు. యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేష్ కూడా ప్రజలకు మాట ఇచ్చారు. ఇప్పుడు ఆ మాట నిలబెట్టుకునే దిశగా సీఎం చర్యలు మొదలు పెట్టారు. ఈ క్రమంలో ఈ రెండు నియోజకవర్గాలు పాత జిల్లాల్లో విలీనం అయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

● రెవెన్యూ డివిజన్‌గా ఉదయగిరి

మూడు రెవెన్యూ డివిజన్ల కింద ఉన్న ఉదయగిరి నియోజకవర్గం ప్రత్యేక రెవెన్యూ డివిజన్‌గా రూపాంతరం చెందనుంది. ఎనిమిది మండలాలతో జిల్లాలోనే పెద్ద నియోజకవర్గంగా ఉదయగిరి ఉంది. ప్రస్తుతం ఈ నియోజకవర్గ పరిధిలోని మండలాలు మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో

- మిగతా 6లో..



ఉదయగిరి : ఆర్డీవో కార్యాలయం ఏర్పాటుకు అధికారులు గుర్తించిన బాలికల వసతిగృహం

గన్.. అదిరెన్!

- ఆకట్టుకున్న పోలీస్ ఓపెన్ హౌస్

8లో..

తుఫాన్ బాధితులను ఆదుకుంటాం : కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లోని బాధితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. తుఫాన్ అనంతరం తీసుకుంటున్న చర్యలు, వాటి పురోగతిపై ఆర్డీఓలు, తహసీల్దార్లతో గురువారం కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో 3,635 కుటుంబాలు వసతి పొందాయని తెలిపారు. అదనంగా 13,512 మత్స్యకార కుటుంబాలు, 106 చేనేత కుటుంబాలు తుఫాన్ ప్రభావితులుగా ఉన్నాయని తెలిపారు చేనేత కుటుంబాలకు సంబంధించి పక్కాగా సర్వే చేయాలన్నారు. వారందరికీ నిత్యావసర సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని కోరారు. సహాయక చర్యల్లో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి పారదర్శకంగా సహాయం అందేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.



రాళ్లపాడు ప్రాజెక్టులో ఒక గేటు ద్వారా మన్నేరుకు విడుదలవుతున్న నీరు

'సోమశిల'కు భారీగా పెరిగిన వరద

అనంతసాగరం అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద పెరుగుతోంది. బుధవారం 48,330 క్యూసెక్కులు వస్తుండగా గురువారం సాయంత్రానికి 80వేల క్యూసెక్కులకు పెరిగింది. దిగువకు గేట్ల ద్వారా 78,460 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. డ్యాంలో 71.851 టీఎంసీలు నిల్వ ఉంది. దిగువకు వదులుతున్న వరద ఎక్కువవడంతో పెన్నాపరిసరాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

- **రాపూరు :** కండలేరు డ్యాం సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 58.83 టీఎంసీల నీరు ఉన్నట్లు ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 1,530 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తుండగా, 2,480 క్యూసెక్కుల నీరు అవుట్‌ఫ్లో వెళ్తుందని అధికారులు పేర్కొన్నారు.
- **లింగసముద్రం :** రాళ్లపాడు ప్రాజెక్టులో ఒక గేటును ఎత్తి మన్నేరుకు వరద నీటిని విడుదల చేశారు. బుధవారం రాత్రి 11 గంటల సమయంలో 2400 క్యూసెక్కుల వరద వస్తుండడంతో ప్రాజెక్టు డీఈలు ఎం వెంకటేశ్వర్లు, శేషయ్య, ఏఈ బి మనోహర్‌లు 3వ గేటును 1.5 అడుగల మేర ఎత్తి 1,850 క్యూసెక్కుల నీటిని మన్నేరుకు విడుదల చేశారు. గురువారం ఉదయం వరద ప్రవాహం తగ్గడంతో గేటును దించేశారు. ప్రాజెక్టులోకి 580 క్యూసెక్కుల మేర నీరు వస్తోందని, నీటిమట్టం 19.8 అడుగులు ఉందని అధికారులు తెలిపారు.

'హౌసింగ్'లో విచారణ

- నాణ్యత పరిశీలనకు ప్రభుత్వం నిర్ణయం
- కాంట్రాక్టర్లు కట్టిన ఇళ్ల పరిశీలన
- థర్డ్ పార్టీకి అప్పగింత.. మొదలైన చెకింగ్
- అధికారులు, కాంట్రాక్టర్లలో గుబులు

తప్పు చేసిన వారు ఎప్పటికీ తప్పించుకోలేరన్న సత్యం మరోసారి హౌసింగ్ శాఖలో నిరూపితమవుతోంది. గత ప్రభుత్వంలో అధికార పార్టీ నేతల అండతో రూ.వందల కోట్ల పేదల సొమ్మును దోచుకున్న భోక్తలు.. ప్రభుత్వం మారాక కూడా ఆ దోచుకున్న డబ్బుతో మేనేజ్ చేసుకుంటూ వచ్చారు. అయితే జరిగిన అవినీతిపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. జిల్లావ్యాప్తంగా కాంట్రాక్టర్లు నిర్మించిన ఇళ్ల నాణ్యతను పరిశీలించాలని కీలక నిర్ణయం తీసుకుంది. ఈ బాధ్యతలను ప్రభుత్వ శాఖలకు కాకుండా థర్డ్ పార్టీకి అప్పగించింది. ఇప్పటికే బిల్లుల చెల్లింపులో అవకతవకలు జరిగాయని, సుమారు రూ.110 కోట్ల వరకూ కాంట్రాక్టర్లకు దోచిపెట్టారని విజిలెన్స్ అధికారులు నిగ్గు తేల్చారు. ఇప్పుడు క్వాలిటీపై విచారణ జరుగుతుండటంతో మరిన్ని అవకతవకలు బయటపడే అవకాశాలున్నాయి.

నెల్లూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద కేంద్ర ప్రభుత్వం భారీగా ఇళ్లు మంజూరు చేయడంతో గత ప్రభుత్వంలో లేఅవుట్లు వేసి ఈ ఇళ్లను పేదలకు కేటాయించారు. ఆ సందర్భంగా మూడు ఆప్షన్లు ద్వారా ఇళ్లు నిర్మించుకునేందుకు అవకాశం కల్పించగా, ఆప్షన్-3 కింద ప్రభుత్వమే నేరుగా ఇళ్లు కట్టించి ఇచ్చే సౌలభ్యాన్ని కల్పించారు. అయితే హౌసింగ్ అధికారులు వేల సంఖ్యలో ఇళ్లను లబ్ధిదారులకు తెలియకుండానే వారికి నచ్చిన కాంట్రాక్టర్లకు అప్పగించారు. జిల్లాకు 97,500 ఇళ్లు మంజూరవగా వాటిలో ఆప్షన్-3 ఇళ్లు సుమారు 29 వేల వరకూ ఉన్నాయి. వీటిలో 6400 ఇళ్లు పూర్తయినట్లు చూపిస్తుండగా, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నట్లు చూపిస్తున్నారు. మెజారిటీ ఇళ్లు బేస్‌మెంట్ స్థాయిలోనే ఉన్నాయి. నాసిరకంగా బేస్‌మెంట్ కట్టి ఒక్కో ఇంటికి రూ.70 వేల చొప్పున కాంట్రాక్టర్లు మింగేశారు. జిల్లాలో ఇప్పటి వరకూ ఈ ఆప్షన్-3 కింద కాంట్రాక్టర్లకు బిల్లులు, మెటీరియల్ రూపంలో సుమారు రూ.350 కోట్ల వరకు చెల్లించారు. చాలా చోట్ల ఇళ్ల బేస్‌మెంట్లు కట్టి వదిలేయడం, కొన్ని చోట్ల ఉండేందుకు పనికిరాని విధంగా నాసిరకంగా నిర్మించడంతో గతేడాది సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. ఆ నేపథ్యంలో ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఆ విచారణలో భారీగా అక్రమాలు బయటపడ్డాయి. అయితే అప్పుడు ఇళ్ల నాణ్యత జోలికి వెళ్లలేదు. తాజాగా ప్రభుత్వం పేదల ఇళ్ల నాణ్యతను కూడా పరిశీలించాలని నిర్ణయించింది. గురువారం నుంచి జిల్లాలో థర్డ్ పార్టీ బృందం క్వాలిటీ చెకింగ్ మొదలుపెట్టింది. మొత్తం 17 మంది సభ్యులతో కూడిన ఈ థర్డ్ పార్టీ ప్రత్యేక మిషన్లతో వెంకటేశ్వరపురం లేఅవుట్, కొండ్లపూడి లేఅవుట్లలోని ఇళ్ల నాణ్యతను పరిశీలిస్తోంది.

● అక్రమార్కుల్లో గుబులు

ఇకపై నిర్మించే ఇళ్ల విషయంలోనూ ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. ఏఈ నుంచి పీడీ వరకూ ప్రతీ ఒక్కరూ ఇళ్ల నాణ్యతను పరిశీలించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎక్కడ అవకతకలు జరిగినా చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించింది. ఇలా తాజాగా ప్రభుత్వం పేదల ఇళ్ల విషయంలో తీసుకున్న కీలక నిర్ణయాలు అధికారులు, కాంట్రాక్టర్లలో గుబులు పుట్టిస్తున్నాయి. ఇప్పటివరకూ జరిగిన తప్పులకు తామెక్కడ బలవుతామోనని అధికారులు భయపడుతుండగా, ఇప్పటివరకూ సంపాదించినదంతా తిరిగి కట్టాల్సి వస్తుందోనని కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారని హౌసింగ్ వర్గాలు చర్చించుకుంటున్నాయి.



పేదల ఇళ్ల నాణ్యతను పరిశీలించేందుకు ప్రత్యేక మిషన్లతో వచ్చిన థర్డ్ పార్టీ సిబ్బంది



బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఏపీటీఎస్ఏ నాయకులు

జిల్లా ఖజానా అధికారిగా శ్రీనివాసులు

నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఖజానా అకౌంట్స్ అధికారిగా (ఎఫ్ఏసీ) బి.శ్రీనివాసులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులును ఏపీటీఎస్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, నాయకులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

● పరిశ్రమల శాఖ ఇన్‌చార్జి జీఎంగా...

నెల్లూరు (వెంకటేశ్వరపురం) : జిల్లా పరిశ్రమల శాఖ ఇన్‌చార్జి జీఎంగా జీ.చంద్రశేఖర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడున్న మారుతీప్రసాద్ పదోన్నతిపై విజయవాడకు బదిలీ అయిన విషయం తెలిసిందే. నూతన జీఎంను నియమించే వరకు తిరుపతి జిల్లా పరిశ్రమల శాఖ జీఎం చంద్రశేఖర్‌కు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. నగరంలోని పరిశ్రమల శాఖ కార్యాలయంలో ఆయనకు ఏడీ శ్రీనివాసులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

రామదేవిపల్లి ఎమ్మార్పీఎస్ కమిటీ ఎంపిక

రాపూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని రామదేవిపల్లిలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని గురువారం ఎమ్మార్పీఎస్ జిల్లా అధికారి ప్రతినిధి గోవిందు రంగయ్య ప్రకటించారు. రామదేవిపల్లి అరుంధతి వాడ గ్రామాధ్యక్షుడిగా మేక అంకయ్య, ఉపాధ్యక్షుడిగా కొమ్మల అంకయ్య, ప్రధాన కార్యదర్శిగా కరిపం ఈశ్వరయ్య, కోశాధికారిగా మంద రమణయ్య, తూమాటి వెంకట రమణయ్యలను ఎన్నుకున్నారు. రాపూరులో నవంబరు 4న జరిగే మాదిగల రాజకీయ అవగాహన సదస్సుకు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11477
వెండి కిలో ధర	రూ. 152000
వెండి ఒక గ్రాము	రూ. 158.00

ఈసీ అనుమతి లేకుండా ఇంటర్వ్యూలా?

వెంకటాచలం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఈసీ అనుమతి లేకుండానే ఇంటర్వ్యూలు ఎలా నిర్వహిస్తారని వర్సిటీ కళాశాల ఎంఎస్‌డబ్ల్యూ విద్యార్థి యు శ్యాంసుందర్ ప్రశ్నించారు. వీఎస్‌యూ ప్రాంగణంలో గురువారం సాయంత్రం విద్యార్థులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యూజీసీ నిబంధనలకు వ్యతిరేకంగా ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసీ) అనుమతి లేకుండా వీఎస్‌యూ ఇలా ఇంటర్వ్యూలు చేపట్టడం చట్టవిరుద్ధమని ఆరోపించారు. 2016లో కోర్టు స్వయంగా ఇంటర్వ్యూలు నిర్వహించరాదని ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. వీఎస్‌యూ అధికారులు కోర్టు ఉత్తర్వులను సైతం తుంగలోకి తొక్కారని విమర్శించారు. ఏఆర్ చెప్పినట్లు వీఎస్‌యూ ఉన్నతాధికారులు వ్యవహరిస్తుండడం బాధాకరమన్నారు. వీఎస్‌యూ ప్రాంగణంలోని వసతి గృహాల్లో పలు సమస్యలు ఉన్నాయని, వాటిని కలెక్టర్ దృష్టికి త్వరలో తీసుకెళ్తామన్నారు.

కాగితంపై పటేల్




మనుబోలు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తక్కువ ఖర్చుతో, వ్యర్థ పదార్థాలతో సూక్ష్మ చిత్రాలు చేసి అందరిని అబ్బురపరిచే తెలుగుపండిట్ సోమా పద్మారత్నం సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి స్ఫూర్తి చిత్రాన్ని కాగితంపై కార్వింగ్ చేసి గురువారం ప్రదర్శించారు.

పారిశుధ్య పనుల తనిఖీ

కొడవలూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో అన్నీ గ్రామపంచాయతీలు జరుగుతున్న పారిశుధ్య పనులను ఎంపీడీవో వెంకటసుబ్బారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెమ్మారెడ్డిపాలెం, మిక్కిలింపేట, తాటాకుల దిన్నె బొంతలపాలెం, వడ్డుపాలెం పాతవంగళ్లు తదితర గ్రామ పంచాయతీల్లో జరు గుతున్న పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. ప్రజలతో మాట్లాడారు. నిర్లక్ష్యం వహిస్తున్న పంచాయతీ కార్యదర్శుల మీద చర్యలు తీసుకుంటామని తెలిపారు. అన్నీ మంచినీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయవలసిందిగా ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అంటువ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఆదేశించారు. మురికి కాలువలో పూడికలు తీయడం పూర్తి చేయాల్సిందిగా అందరు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మంచినీటి బావుల్లో క్లోరినేషన్ చేయవలసిన కూడా ఏఎన్ఎంలను ఆదే శించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డిప్యూ టీ ఎంపీడీవో మురళీ, పాత ఒంగోలు పం చాయతీ కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు.

మధురానగర్ మత్స్యకారుల ప్రావీణ్యం

సత్కరించిన అధికారులు



అభినందిస్తున్న అధికారులు

ముత్తుకూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : సంగం మండలం పెన్నా డ్రాఫ్ట్ వద్ద ఇరుక్కున్న డ్రెడ్డింగ్ పడవలను తీసుకురావడంలో గురువారం ముత్తుకూరు మధురానగర్‌కి చెందిన గజ ఈతగాళ్లు తమ ప్రావీణ్యం చూపించారు. పడవల స మాచారం తెలిసి కృష్ణపట్నం ఎస్ఐ జేపీ శ్రీనివాసులురెడ్డి మధురానగర్ మత్స్యకార కాపులను సంప్రదించి గజ ఈతకాళ్లను సం గం పంపించారు. డ్రాఫ్ట్ వద్ద ఇరుకున్న పడవలను సురక్షితంగా ఒడ్డుకు చేర్చడంలో కీలకంగా వ్యవహరించారు. సహాయక చర్యల్లో పాల్గొన్న బుచ్చంగారి మోహన్, మస్తాన్, జానకిరామ్, కొండూరు కోటేశ్వరరావు, రోసిరాజా, కోలంగారి దామోదరరావు, కాటంరెడ్డి నరసింహ, అక్కయ్యగారి ఏడుకొండలును స్థానిక అధికారులు సన్మానించారు. తుఫాను సమయాల్లో జిల్లాలో ఎక్కడ సమస్య వచ్చినా సహాయ సహకారాలు అందిస్తున్న ముత్తు కూరు మత్స్యకారులను మండల టీడీపీ అధ్య క్షుడు నీలం మల్లికార్జున యాదవ్, మత్స్యకార సంఘం నాయకులు వావిళ్ల జనార్థన్ అభినందించారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

ఉదయగిరి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ పోలీసు సంస్మరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఉదయగిరి సీఐ ఎన్ వెంకటరావు గురువారం పేర్కొన్నారు.

తల్లీ గోమాతా.. కాస్త తప్పుకోవమ్మా!!

- ఆవులు అడ్డురావడంతో ప్రమాదాలు
- గాయపడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని పోలీసులు, ఐజేఎం అధికారులు



మనుబోలు జాతీయ రహదారి వద్ద డివైడర్ మధ్య గడ్డి మేస్తున్న ఆవులు

మనుబోలు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అది జాతీయరహదారి. రెండువైపుల వాహనాలు రయ్..రయ్ అని దూసుకెళుతుంటాయి. అయితే ఇక్కడకు వచ్చే సరికి దూసుకెళ్లే వాహనాలకు ఆవులు బ్రేక్‌లు వేస్తున్నాయి. ఈ బ్రేక్‌లే పలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. కొన్ని నెలలుగా ఇలాంటి సంఘటనలు మనుబోలు మండలంలో జరుగుతున్నా ఇటు పోలీసులు, అటు రోడ్డుభద్రతా అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రయాణీకులు ఆగ్రహం చెందుతున్నారు.

●16 కిలోమీటర్లు.. 8 చోట్ల క్రాస్‌రోడ్లు...

మండల పరిధిలో జాతీయరహదారి సుమారు 16 కి.మీ ఉంటుంది. ఇందులో 8 చోట్ల క్రాస్‌రోడ్లు ఉన్నాయి. మండలపరిధి మొదలైనప్పటినుంచి ముగిసే వరకు డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాల్సి వస్తోంది. అవతలిరోడ్డు నుంచి ఇవతలి రోడ్డుకు ఎప్పుడు ఆవులు అమాంతంగా వచ్చేస్తాయో తెలీదు. పగలు, రాత్రిళ్ళు తేడా లేకుండా ఆవులు తమ దారి జాతీయ రహదారి అంటూ విచ్చలవిడిగా సంచరిస్తుంటాయి. ఎక్కువగా మనుబోలు, కాగితాలపూరు, కొండూరు సత్రం సమీపంలో ఆవులు తిరుగుతుంటాయి. ఈ గ్రామాలకు చెందిన వారే ఆవులను కొనుగోలు చేసి ఇలా రోడ్లమీదకు వదిలేస్తున్నారు. దీంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. పలువురు ఆసుపత్రి పాలవుతున్నారు. వాహనాలు దెబ్బ తింటున్నందున యజమానులు నష్టపోతున్నారు.

●ఈనెల 23న ఆత్మకూరు ఆర్టీసీ బస్సు వెళుతుండగా ఆవుల మంద అడ్డురాగా సడన్‌బ్రేక్ వేయడంతో, వెనుక వస్తున్న ట్రావెల్ బస్సు ఢీకొంది.

● 25వ తేదీన పోలీస్‌స్టేషన్ సమీపంలోనే ఆవులు రోడ్డుపైకి రాగా, వాటిని తప్పించేందుకు లారీ సడన్‌బ్రేక్ వేయగా, వెనుక వస్తున్న మరో లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీడ్రైవర్ రాజ్‌కుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

● అదే రోజున ఆవుల మంద కారణంగానే గూడూరు వెళుతున్న కారు బ్రేక్ వేయగా, ఒరిస్సా నుంచి 50 మందితో కేరళ వెళుతున్న ప్రైవేట్ బస్సు కారును ఢీకొంది. దీంతో కారు వెనుక భాగం దెబ్బతింది. ప్రయాణీకులు ఆ రోజంతా స్టేషన్‌వద్ద పడిగాపులు కాచారు.

రోడ్డుపై విచ్చలవిడిగా తిరుగుతున్న ఆవులు, బర్రెల యజమానులకు పోలీసులు, అధికారులు హెచ్చరికలు జారీ చేయాలి. వారు పట్టించుకోకపోతే వాటిని ఆయా గ్రామాల పంచాయతీ అధికారులకు అప్పజెప్పి బందిలి దొడ్డిలో ఉంచి జరిమానాలు కట్టించేలా చర్యలు తీసుకోవాలి. అప్పుడైతే మూగజీవాల యజమానులు వాటిని బయటకు పంపకుండా జాగ్రత్తలు తీసుకోగలుగుతారని పలువురు అభిప్రాయపడుతున్నారు.

వీఎస్‌యూలో ఇంటర్వ్యూలు

వెంకటాచలం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీ ప్రాంగణంలో గురువారం ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు జరిగాయి. ఈ ఇంటర్వ్యూలను వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత దగ్గరుండి పర్యవేక్షించారు. వీఎస్‌యూ పరిధిలోని కావలి పీజీ క్యాంపస్‌లోని ఫార్మసీ కళాశాలలో ప్రిన్సిపాల్, అసిస్టెంట్ ప్రొఫెసర్, నాన్ టీచింగ్ పోస్టులను తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేసేందుకు ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) నిబంధనల ప్రకారం ఇంట ర్వ్యూలను నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు భారీగా అభ్యర్థులు విచ్చేశారు.

పోలంరెడ్డి పరామర్శ

కోవూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గంగవరం గ్రామంలో ఇటీవల మృతి చెందిన టీడీపీ నాయకుడు ఖాజారహంతుల్లా కుమారుడు అబ్దుల్ లతీఫ్ కుటుంబసభ్యులను మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి గురువారం పరామర్శించారు. చిన్నవయస్సులోనే లతీఫ్ మృతి చెందడం బాధాకరమన్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చంద్రయ్య, మోషే, శివకుమార్, నాగేంద్ర, సురేష్, బాబు, తిరుమూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

పాఠశాలల పరిశీలన

ఉదయగిరి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల బాధ్యత ఉపాధ్యాయులదేనని ఎంఈవోలు టీ వెంకటేశ్వర్లు, టీ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం మండలంలోని మాసాయిపేట మెయిన్, హరిజనవాడ ప్రాథమిక, పట్టణంలోని నార్త్ పాఠశాలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం సంబంధిత రిజిస్టర్లు, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కాపాడాలి

అనంతసాగరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్తాపురం, పాతాశపల్లి గ్రామాల పరిధిలో ప్రభుత్వ భూ ములను కాపాడాలని కోరుతూ మాజీ నీ టి సంఘం సభ్యుడు శ్రీమన్నారాయణ తహసీల్దారు జయవర్ధన్, ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్‌కు గురువారం విజ్ఞప్తి చేశారు.

సీఎం ప్రేరణతో చక్కగా పని చేశారు

●ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

ఇందుకూరుపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తుఫాను నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధికార యంత్రాంగాన్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడం వల్లే ఆస్తి, ప్రాణ నష్టాలను నివారించగలిగామని, సీఎం ప్రేరణతో అధికారులు, నాయకులు సమన్వయంతో చక్కగా పని చేశారని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండలంలోని మైపాడులో గురువారం మొంథా తుఫాను కారణంగా ఉపాధి కోల్పోయిన మత్స్యకార కుటుంబాలకు ఆమె నిత్యావసర సరుకుల కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం తక్షణ సహాయంగా 50 కిలోల బియ్యంతో పాటు ఒక కిలో కందిపప్పు, 1 కేజీ పామాయిల్, కిలో ఉల్లిగడ్డలు, కిలో ఎర్రగడ్డలు అందజేశామన్నారు. ముంపు ప్రాంతవాసులను పునరావాస కేంద్రాలకు తరలించి అధికారులతో కలిసి సహాయక చర్యల్లో పాల్గొన్న టీడీపీ, కూటమి పార్టీల నాయకులను ఆమె అభినందించారు. ప్రజలకు ఏ ఇబ్బందీ లేకుండా కాపాడిన రెవెన్యూ, పోలీసు, వైద్య శాఖాధికారుల పనితీరును ఆమె ప్రశంసించారు. సహాయక శిబిరాలలో వుంటున్న బాధితులకు భోజనం, చిన్నపిల్లలకు పాలు అందించిన నాయకులు, కార్యకర్తలు ముందు ముందు ఇదే స్ఫూర్తితో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు, దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, రావెళ్ల వీరేంద్రనాయుడు, కోడూరు కమలాకర్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు పవన్‌కుమార్ రెడ్డి, పొన్నెబోయిన చెంచు కిషోర్ యాదవ్, జడ్పీ వైస్ చైర్మన్ శ్రీహరికోట జయలక్ష్మీ, తహసీల్దారు గోపీకృష్ణ, ఎంపీడీవో నాగేంద్రబాబు, వెస్ట్‌పాలెం పెద్దకాపు ఊటుకూరు సుబ్రహ్మణ్యం, ఈస్ట్ పాలెం పెద్దకాపు శ్రీహరిర శ్రీనివాసులు, మత్స్యకార నాయకులు పామంజి నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు చేయూత



పొదలకూరు : వరద బాధితులకు సరుకులు అందిస్తున్న తహసీల్దారు, తలచీరు మస్తాన్‌బాబు

పొదలకూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాను బాధితులకు సాయం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా గురువారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని నావూరుపల్లి గిరిజన కాలనీవాసులకు పీఏసీఎస్ చైర్మన్ తలచీరు మస్తాన్‌బాబు ఆధ్వర్యంలో మొంథా తుఫాను కారణంగా నిరాశ్రయులైనవారికి పునరావాస కేంద్రాలకు తర లించినవారికి ఒక్కో కుటుంబానికి బియ్యం (25కేజీలు), కంది పప్పు (1కేజీ), చక్కెర (1కేజీ), పామాయిల్ (1లీ), బంగాళా దుంపలు (1కేజీ) ఆనియన్స్ (1కేజీ) చొప్పున లబ్ధిదారులకు అందజేశారు. వీటితోపాటు దుప్పట్లు కూడా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు బి. శివకృష్ణయ్య, టీడీపీ నాయకులు అలుపూరు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

● పొదలకూరులో...

పట్టణంలోని శివాలయం వీధి, పాములవీధి, శ్రామిక నగర్‌లోని తుఫాన్ బాధితులకు వారికి పట్టణ అధ్యక్షుడు బొద్దు లూరి మల్లికార్జున్‌నాయుడు ఆధ్వర్యంలో బియ్యం నిత్యవసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు రైతు సంఘం నాయకులు బక్కయ్య నాయుడు, వీఆర్‌ఓ నాగమ్మ, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

విడవలూరు: మొంథా తుఫాను కారణంగా పార్లపల్లిలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో బాధితులకు గురువారం తహసీల్దారు చంద్రశేఖర్ 25 కేజీల బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో పునరావాస కేంద్రాల్లో ఉన్న 283 కుటుంబాలకు నిత్యావసర సరుకులను అందజేస్తున్నామన్నారు. మొదట తెల్లరేషన్ కార్డులు కలిగిన వారికి ఇస్తున్నామని, ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాక రేషన్‌కార్డులు లేనివారికి కూడా అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అబ్దుల్ సలాం, పీఏసీఎస్ చైర్‌పర్సన్ వేగూరు చంద్రారెడ్డి, టీడీపీ నాయకులు రామిశెట్టి వెంకటేశ్వర్లు, తాతా బాలకృష్ణ, వీఆర్వో నిఖిల్, పంచాయతీ కార్యదర్శి తిరు పతయ్య పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని దామరమడుగు, కాళయకాగొల్లు గ్రామాలలో తుఫానుకు ఇబ్బందిపడుతూ పునరావాస కేంద్రాలలో తలదాచుకున్న 64 బాధిత కటుంబాలకు గురువారం ప్రభుత్వం ద్వారా వచ్చిన నిత్యావసర సరుకుల కిట్లను మండల అధికారులు పంపిణీ చేశారు. దామరమడుగులో 40 మందికి, కాళయకాగొల్లులో 24 మందికి ఒక్కొక్కరికి 25 కేజీల బియ్యం, 1 కేజీ నూనె ప్యాకెట్టు, 1 కేజీ కందిపప్పు, 1కేజీ ఉర్లగడ్డలు, 1కేజీ ఎర్రగడ్డలు పంపిణీ చేశారు. సరుకులు పంపిణీ కార్యక్రమంలో తహసీల్దారు వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ మంజులమ్మ, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కోటి సోమవారం పూజలు



పొదలకూరు శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

పొదలకూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు శివాలయాల్లో కోటి సోమవారం పూజలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని పురాతన శివాలయంలో అభిషేకాలు, ఉదయం ఉపవాసాలతో దీపాలు వెలిగించి నైవేద్యాలు సమర్పించారు. అలాగే మండలంలోని మొగళ్లూరు సమీపంలోని సిద్ధలకొండ, డేగపూడి, బిరదవోలు, చెన్నా రెడ్డిపల్లి, విరువూరు, గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించారు. ప్రదోషకాల పూజలు చేశారు. కోటి సోమవారం చేసే ఉపవాసం, దానం, జపం, స్నానం కోటి రెట్లు ఫలితాన్ని ఇస్తుందని స్కందపురాణం చెబుతోందని పొదలకూరు శివాలయ ప్రధాన అర్చకులు ప్రసాద్‌స్వామి తెలిపారు.

శివాలయంలో అన్న సంతర్పణ

మనుబోలు : స్థానిక శివాలయంలో గురువారం కోటిసోమవారం సందర్భంగా అన్న సంతర్పణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కోటిసోమవారం కావడంతో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆలయ అర్చకులు వేదమంత్రాలతో బ్రహ్మేశ్వరుడికి, కామాక్షిదేవికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం అన్న సంతర్పణ కార్యక్రమంకు ఆమంచర్ల సుధాకర్‌రెడ్డి కుటుంబసభ్యులు ఉభయదాతలుగా వ్యవహరించారు.

చెరువులను తలపిస్తున్న పొలాలు



బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావంతో పొలాలన్నీ చెరువులను తలపిస్తున్నాయి. మండలంలోని పంచేడు, మినగల్లు క్రాస్ రోడ్డు సమీపంలో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్, దాని ఎగువ ప్రాంతం నుంచి మినగల్లుకు వెళ్ళే రోడ్డు వరకు వందలాది ఎకరాల పొలం చెరువును తలపిస్తోంది. దీంతో ఆ ప్రాంతంలో వున్న విద్యుత్ సబ్‌స్టేషన్ జలదిగ్బంధంలో చిక్కుకుంది. సబ్‌స్టేషన్‌లోకి వెళ్ళే దారిలో 2నుంచి 3 అడుగుల లోతు నీరు నిల్వ ఉంది. దీంతో సబ్‌స్టేషన్ సిబ్బంది లోపలికి వెళ్ళేందుకు కష్టతరమౌతోంది. జలమయమైన వ్యవసాయ భూముల్లోనుంచి ముంపు నీరు వెళ్ళే ఊటు కాలువ ఆక్రమణలకు గురవడంతో ఈ పరిస్థితి నెలకొందని ఆ ప్రాంత రైతులు వాపోతున్నారు. రెవెన్యూ అధికారులకు ఎమ్మెల్యే చెప్పినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా తగిన చర్యలు చేపట్టాలన్నారు.

రైలు ఢీకొని మహిళ మృతి



మంజులమ్మ (ఫైల్)

వెంకటాచలం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు రైలు ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన గురువారం ఉదయం వెంక టాచలం రైల్వే స్టేష న్‌లో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఇడి మేపల్లికి చెందిన రొండ్ల మంజులమ్మ (52) క్రైస్తవ ప్రార్థనల కోసం చెన్నై వెళ్లేందుకు మరికొందరితో కలిసి వెంకటాచలం రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. ఆ సమయంలో చెన్నై వైపు సూపర్ ఫాస్ట్ రైలు వెళ్తుండగా, ఆ వేగానికి ఆమె దుస్తులు తగులుకొని ప్రమాదవశాత్తు రైలు పట్టాలు, ప్లాట్‌ఫామ్ మధ్యలో పడిపోయింది. తీవ్రంగా గాయపడడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. గతంలో ఈమె అంగన్‌వాడీ కార్యకర్తగా కూడా పని చేశారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- 15 మంది అరెస్టు
- రూ.91 వేలు, వాహనాల స్వాధీనం

నెల్లూరు(క్రైం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని రాయపు పాలెం సమీప ఖాళీస్థలాల్లో గురువారం పేకాడుతున్న వారిపై బాలాజీ నగర్ పోలీసులు దాడి చేసి 15 మందిని అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ సాంబశివరావుకు అందిన సమాచారంతో ఆయన సిబ్బందితో కలిసి దాడి చేశారు. పేకాడుతున్న డీ రవికృష్ణ, డీ చంద్రమోహన్, కే రవి, షేక్ మస్తాన్, ఆర్ సుబ్బారావు, విజయ, జీ కృష్ణకాంత్, ఎస్ ఏలియా, పీ రత్నం, ఎం రమేష్, వీ సురేంద్ర, వీ సందీప్‌రెడ్డి, వేణు, జీ వెంకటేశ్వర్లు, కే రవిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.91,910 నగదు, ఆరు బైక్‌లు, కారు, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో ఎస్ఐ పుల్లారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎంపై అసభ్యకర పోస్టులు పెట్టారని కేసు

నెల్లూరు రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై ఎక్స్ వేదికగా అసభ్యకర పోస్టులు పెట్టారన్న ఫిర్యాదుతో బంగారు రాజు అనే వ్యక్తిపై నెల్లూరు రూరల్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. మీ బంగారు రాజు అనే ఖాతా ద్వారా బంగారురాజు అనే వ్యక్తి సీఎం, డిప్యూటీ సీఎంపై అసభ్యకరంగా పోస్టులు పెట్టినట్లు నగరానికి చెందిన బల్లి ప్రీతివర్ధన్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ వేణు తెలిపారు. బంగారు రాజు తన అడ్రస్సు కల్లూరుపల్లిగా పేర్కొన్నట్లు తెలిసిందని పేర్కొన్నారు.

చెరువులకు జలకళ

● సాగునీటికి ఢోకా లేనట్లే..



అలుగుపారుతున్న ఆత్మకూరు చెరువులో చేపలు పడుతున్న యువకులు

సంగం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లా లోని చెరువులన్నీ జలకళను సంతరించుకున్నాయి. జిల్లావ్యాప్తంగా 1007 చెరువులు ఉండగా, వీటి సామర్థ్యం సుమారు 54 టీఎంసీలు. ఈ చెరువుల కింద 3 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. మొన్నటి వరకు అడుగంటిన చెరువులు వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో 75 శాతం నీళ్లు చేరా యి. అంటే దాదాపు 39 టీఎంసీల నీరు చేరినట్టు అంచనా వేస్తున్నారు. 311 చెరువులు కలుజులు పారుతున్నాయి.

● చెరువుల పటిష్ఠతకు చర్యలు

ముంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు చెరువులకు గండ్లు పడకుండా అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు చేపడుతోంది. ఇప్ప టికే నిండిన చెరువుల్లో 30 శాతం నీటిని కలుజులతోపాటు తూముల ద్వారా నీటిని తరలించారు. పూర్తి సామర్థ్యం సంతరించుకున్న చెరువులకు గండ్లు పడకుండా చర్యలు ఇరిగేషన్ అధికారులు చేపడుతున్నారు. చెరు వులన్నీ పూర్తి సామర్థ్యంతో సంతరించుకుని రబీ సీజన్‌లో చెరువుల కింద 3 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు వీలు కలిగింది. ఇరిగేషన్ ఎస్ఈ దేశీనాయక్ మాట్లాడుతూ ప్రస్తుతం చెరువులకు ఎలాంటి ముప్పు లేదని, ఎక్కడైనా గండ్లు పడే అవకాశం ఉంటే రక్షణ చర్యలకు ఆదే శాలిచ్చినట్లు చెప్పారు. వచ్చే రబీ సీజన్‌లో చెరువుల కింద పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీటి ఢోకా లేదన్నారు.

యథాతథంగానే!

(5వ పేజీ తరువాయి)

ఉన్నాయి. వెనుకబడిన ఈ నియోజకవర్గంలో సత్వరం అభివృద్ధి పనులు చేపట్టాలన్నా, సమస్యలు పరిష్కరించాలన్నా మూడు డివిజన్ల అధికారులతో చర్చించాల్సి రావడం ఎమ్మెల్యేలకు కష్టతరంగా మారింది. ఈ పరిస్థితి గమనించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఉదయగిరి రెవెన్యూ డివిజన్ కోసం పట్టుపట్టారు. ప్రభుత్వానికి నివేదిక పంపారు. పలుసార్లు రాజధానికి వెళ్లి ప్రత్యేక రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం అభ్యర్థించారు. ఎట్టకేలకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఉదయగిరి ప్రత్యేక రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సానుకూల వాతావరణం ఏర్పడింది.

● వసతులున్నాయా!?

ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ చేసేందుకు తగిన వసతులు ఉన్నాయా... పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని కలెక్టరేట్ నుంచి స్థానిక రెవెన్యూ కార్యాలయానికి ఫోన్ చేసి వివరాలు అడిగారు. దీంతో అధికారులు రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఏర్పాటుకు పట్టణంలోని బాలికల వసతిగృహాన్ని పరిశీలించి అనువుగా ఉంటుందని సూచించారు. మిగిలిన వివరాతలు తెలియజేయడంతో కలెక్టరేట్ నుంచి ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు తెలిసింది.

అభివృద్ధికి అడుగులు పడ్డట్లే...

ఉదయగిరి రెవెన్యూ డివిజన్ ఏర్పాటైతే అభివృద్ధికి అడుగులు పడ్డట్లే. రైతులు, ప్రజలు సమస్యల పరిష్కారం సుదూర ప్రాంతాలకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సైతం డివిజన్ ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకొన్నారు.

\- చింతనబోయిన బయ్యన్న, ఉదయగిరి

తీరనున్న మెట్టవాసుల కల

ఉదయగిరి రెవెన్యూ డివిజన్ అయితే మెట్ట ప్రాంత వాసుల కల నెరవేరుతోంది. ఆనాదిగా అభివృద్ధికి నోచుకోని ఉదయగిరిని జిల్లా చేయాలని ఆరున్నరేళ్లుగా ఉద్యమం చేస్తున్నాం. భవిష్యత్తులో ఉదయగిరి జిల్లా అయ్యేందుకు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు తొలి మెట్టు కానుంది

\- డాక్టర్ కే.వేణుగోపాల్, జిల్లా సాధన సమితి అధ్యక్షుడు, ఉదయగిరి

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	137
స్కిన్ చికెన్	246
స్కిన్‌లెస్	270

కోడిగుడ్ల ధర (100): 575





మూలస్థానేశ్వర ఆలయంలో శివలింగాకృతిలో ఆకట్టుకున్న పుష్పాలంకరణ

మాగుంట లేవుట్‌లో ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



గణేష్ ఘాట్‌లో విద్యుద్దీప కాంతుల్లో వెలిగిపోతున్న స్వర్ణ లింగేశ్వర ఆలయం

శివా... కేశవా!

భక్తిశ్రద్ధలతో కోటి సోమవారం

కిటకిటలాడిన ఆలయాలు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కోటి సోమవారం పర్వది సందర్భంగా నగరంలోని శివాలయాలు, వైష్ణవాలయా ల్లో గురువారం విశేష పూజలు జరిగాయి. హరిహర నామస్మరణతో ఆలయాలు మారుమోగాయి.

● మూలస్థానేశ్వరాలయంలో ఉదయం పాలాభిషేకాలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. సాయంత్రం విశేష పుష్పాలంకరణ ఆకట్టుకుంది. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు దీపం వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. ● రాజరాజేశ్వరి ఆలయంలో ఉదయం సుందరేశ్వరస్వామికి మహా న్యాస పూర్వక రుద్రాభిషేకాలు, పాలాభిషేకాలు, పండ్ల రసాలతో అభిషే కాలు జరిగాయి. రాత్రి స్వామివారికి కుంభహారతులు కన్నుల పండువగా జరిగాయి. ● స్టోన్‌హౌస్‌పేట కన్యకాపరమేశ్వరి ఆలయంలో భవానీ శంకరస్వామికి రుద్రాభిషేకాలు జరిగాయి. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ● నవాబుపేట మల్లేశ్వరస్వామి ఆలయంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, పూలంగి సేవ, ప్రాకారోత్సవం జరిగాయి. ● గణేష్ ఘాట్‌లోని స్వర్ణలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవ కమిటీ ఆధ్వర్యంలో కోటి సోమవారం పూజలు జరిగాయి. మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, విశేష అర్చనలు జరిగాయి. ● ఉస్మాన్‌సాహెబ్‌పేట కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. ● బాలాజీనగర్ సీతారామమందిరంలో కల్యాణ వెంకటేశ్వర స్వామికి శ్రవణ నక్షత్రం సందర్భంగా తిరుమంజనం, ప్రత్యేక అలంకారం, పూజలు జరిగాయి. ● మహాత్మా గాంధీనగర్ కృష్ణమందిరంలోని భవానీ శంకర స్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, వెంకటేశ్వర స్వామికి తులసీదళ అర్చన జరిగాయి. ● మాగుంట లేఅవుట్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి తిరుమంజనం, విశేష పూజలు జరిగాయి. రాత్రి కన్నుల పండువగా కార్తీక దీపోత్సవం జరిగింది. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.





మూలస్థానేశ్వరాలయంలో దీపం వెలిగిస్తున్న వేమిరెడ్డి దంపతులు, స్వామివారి వనంలో ముక్కంటికి హారతి ఇస్తున్న భక్తులు

అండర్‌పాస్ సాధనకు 2న సమావేశం

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 30 (ఆం ధ్రజ్యోతి) : నగరంలోని ఆదిత్య నగర్ స మీపంలో జాతీయ రహదారి వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం కోసం నవంబరు 2వ తేదీన అదేచోట సమావేశం నిర్వహిస్తున్నట్లు వంతెన సాధన కమిటీ కన్వీనర్ కాయం శ్రీనివాసులు వెల్లడించారు. దీనికి సంబంధించిన కరపత్రాలను గురువారం చిల్డ్రన్స్ పార్క్ వద్ద విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ చిల్డ్రన్స్ పార్క్, చింతారెడ్డిపాళెం జంక్షన్ వద్ద అండర్ పాస్ నిర్మించాలని 16 ఏళ్లుగా ప్రభుత్వాన్ని వేడుకుంటున్నామని చెప్పారు. అక్కడ వంతెన లేకపోవడంతో అనేక ప్రమాదాలు జరిగి ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకర్, కొట్టే రామ్మూర్తి, గురుబ్రహ్మం, శివకుమార్ రెడ్డి, పరశురామిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, షంషుద్దీన్, కట్టా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సహనం మహిళలకు ఆభరణం

● ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : సహనం మహిళలకు ఆభరణమని, మహిళలు ఆత్మాభిమానంతో జీవించాలని, ఎవరో ఏదో అనుకుంటారని వెనుకడుగు వేసే స్వభావాన్ని వదిలిపెట్టి అన్నీ రంగాల్లో ముందుకు సాగాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పిలుపు నిచ్చారు. నగరంలోని టౌన్‌హాల్‌లో గురువారం జరిగిన శ్రీపరంజ్యోతి స్త్రీశక్తి కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. స్త్రీలు స్వతహాగా శక్తివంతులని, వారిలో అంతర్లీనంగా దాగి ఉన్న శక్తిని వెలికి తీసి ప్రపంచానికి చాటాలని కోరారు. జీవితంలో ఒడిదుడుకులను ఓర్పుతో ఎదుర్కోవాలని, మనోధైర్యం కోల్పోకూడదన్నారు. ఈ కార్యక్రమంలో సౌజన్య, భగవత్ దాసాజీ భారతి, అనిత, రమణయ్య, కిషోర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

తోపుడు బండి వితరణ

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : చిరు వ్యాపారికి నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు గురువారం నగరంలోని వారి నివాసంలో తోపు బండిని అందచేశారు. బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన కూరగాయల వ్యాపారం చేసుకొనే రాణి అనే పేద మహిళకు ఈ బండిని వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా వితరణ చేశారు.

నేటి యూనిటీ మార్చ్‌లో పాల్గొనండి

ఉక్కు మనిషి, దేశ తొలి ఉపప్రధాని సర్దార్ వల్లభాయి పటేల్ 150వ జయంతి సందర్భంగా శుక్రవారం నెల్లూరులో జరిగే యూనిటీ మార్చ్‌లో యువత, ప్రజలు, వివిధ రంగాల నిపుణులు పాల్గొనాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో కోరారు. పటేల్ అసాధారణ కృషి, వారసత్వాన్ని గౌరవిస్తూ కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ సర్దార్-150 కార్యక్రమాన్ని ప్రారంభిస్తోందని తెలిపారు.

సీపీఆర్‌పై అవగాహన సదస్సు

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రభుత్వ బీఈడీ కళాశాలలో విద్యార్థులకు గురువారం సీపీఆర్‌పై అవగాహన సదస్సు జరిగింది. ప్రమాదస్థితిలో ఉన్న వ్యక్తి గుండె కొట్టుకోవటం స్తంభించిన ప్పుడు, శ్వాస తీసుకోవటం ఇబ్బందిగా ఉన్నప్పుడు సీపీఆర్ చేయడం ఎలాగో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కో ఆర్డినేటర్ సుందర్‌రాజా వివరించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ పాలక మండలి సభ్యుడు దాసరి రాజేంద్ర ప్రసాద్, ఫిజియోథెరపిస్ట్ పురంధర్, డాక్టర్ ఎల్ఎంఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

భార్య అదృశ్యంపై ఫిర్యాదు

నెల్లూరు రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తన భార్య మౌనికరెడ్డి కొన్ని రోజులుగా కనపడటలేదని నెల్లూరు రూరల్లోని ధనలక్ష్మీపురానికి చెందిన మహేష్‌రెడ్డి ఫిర్యాదు చేసినట్లు రూరల్ సీఐ గుంజి వేణు గురువారం తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మొక్కలు నాటిన ఎస్‌బీఐ అధికారులు

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : భారతీయ స్టేట్ బ్యాంక్ కలెక్టరేట్ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని వెంగళరావునగర్ మున్సిపల్ హైస్కూల్లో గురువారం అధికారులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ హరికృష్ణ, ఎంఎస్ శశికుమార్, ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుండాల నరేంద్ర పాల్గొన్నారు.

కలెక్టర్‌కు విద్యార్థుల అభినందన

నెల్లూరు(విద్య), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొని జిల్లాలో అధికనష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్న కలెక్టర్ హిమాన్షు శుక్లాకు నగరంలోని సిల్వర్ ఓక్స్ పాఠశాల విద్యార్థులు అభినందనలు తెలిపారు. వారు గురువారం కలెక్టరేట్‌లో శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. తుఫాన్ అప్రమత్తత పై సోషల్ మీడియాలో వీడియోలు షేర్ చేసిన విద్యార్థులను ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశంసించా రు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ షణ్ము ఖాచారి, వెంకటాద్రి, ప్రిన్సిపాల్ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

వరి సాగుదారులందికీ యూరియా : గిరిధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రబీ వ్యవసాయ సీజన్‌లో వరి సాగు చేసిన ప్రతీ రైతుకు సమృద్ధిగా యూరియా అందుతుందని టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని సౌత్‌మోపూరు వద్దనున్న సొసైటీ గోదాములో యూరియా నిల్వలను పరిశీలించారు. అనంతరం రైతులకు కార్డుల ప్రకారం ఎకరాకి మూడు బస్తాల యూరియాను అధికారుల సమక్షంలో పంపిణీ చేశారు. యూరియా కొరత ఉందంటూ కొందరు పనికట్టుకుని వదంతులు సృష్టిస్తున్నారని, వాటిని రైతులు నమ్మొద్దని కోరారు. అనంతరం వెల్లంటి గ్రామంలోనూ యూరియా అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ విజయకుమార్, గుండ్లపాళెం సొసైటీ చైర్మన్ ప్రదీప్, ఏఎంసీ వైస్‌చైర్మన్ చంద్రశేఖర్, నాయకుడు శ్రీనివాసులురెడ్డి, కనుపూరు కాలువ డీసీ రామయ్య, విజయ్‌భరత్ పాల్గొన్నారు.



సౌత్‌మోపూరు గోదాములోని యూరియాను పరిశీలిస్తున్న టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి

తుఫాన్ బాధితులను ఆదుకోండి

● జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లుకు సీపీఎం నాయకుల వినతి

నెల్లూరు రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా గ్రామాల్లో ఉపాధికి దూరమైన వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని సీపీ ఎం నెల్లూరు రూరల్ మండల నాయకులు గురువారం జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లును కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందచేశారు. నాయకులు పూడిపర్తి జనార్దన్, మాదాల వెంకటేశ్వర్లు, ఆలూరు తిరుపాలు మాట్లాడారు. రూరల్లోని అనేక గ్రామాల్లో తుఫాన్ కారణంగా కూలీలు పనిలేక పస్తులుంటున్నారని తెలిపారు. మరో 10 రోజుల వరకు పనులు ఉండవన్నారు. ఈ సమయంలో వారికి ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. వ్యవసాయ సీజన్ మొదలైనందున యూరియా కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు.



జేసీకి వినతి పత్రం అందచేస్తున్న సీపీఎం నాయకులు

కలుజులను ఆధునీకరించాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల

నెల్లూరు రూరల్లోని పొట్టేపాళెం, ములుముడి వద్ద ప్రమాదకరంగా మారిన కలుజులను ఆధునీకరించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆయా ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లు, కలుజుల వద్ద ప్రవాహ ఉధృతిని పరిశీలించారు. పార్టీ జిల్లా కార్యదర్శి అరిగెల నాగేంద్రసాయి మాట్లాడుతూ కలుజుల వద్ద ప్రమాదం పొంచి ఉందన్నారు. వర్షాలకు దెబ్బతిన్న మగ్గాలతో పనిలేనందున చేనేతలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరా రు. ఈ కార్యక్రమంలో నాయకు లు పముజుల దశరథరామయ్య, మాలకొండయ్య, హరి, లీలామోహన్, జిలాని, చల్లా నరసయ్య పాల్గొన్నారు.

నిరాశ్రయులను ఆదుకోవాలి

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ వల్ల నిరాశ్రయులైన పేదలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ షాన్‌వాజ్ డిమాండ్ చేశారు. ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్షాలతో పనులు లేక అనేక కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయని చెప్పారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా చొరవ తీసుకుని పంటలు దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. అలాగే పేదలకు రేషన్ బియ్యం 50 కిలోలు, నిత్యావసర సరకులు ఇచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికి తక్షణ సహాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు షబ్బీర్, సుబ్బరాయుడు, హనుమంతరావు, మున్వర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం నాయకుడు షాన్‌వాజ్

విధుల్లో నిర్లక్ష్యానికి షోకాజు నోటీసులు

● మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని కమిషనర్ ఆదేశం

నెల్లూరు(సిటీ),అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నగర పాలక సంస్థ సిటీ ప్లానింగ్ అధికారులు, పలువురు సచివాలయ ఉద్యోగులకు గురువారం కమిషనర్ నందన్ షోకాజు నోటీసులు జారీ చేశారు. టైలర్స్ కాలనీ వద్ద ఇంటి పన్ను వేయడంలో నిర్లక్ష్యంగా ఉన్నారన్న ఆరోపణలతో సచివాలయ అడ్మిన్ నవితా, పూర్వ అడ్మిన్ జయమ్మతోపాటు ఆర్ఐ శ్రీనివాసులుకు షోకాజు నోటీసులిచ్చారు. మాగుంట లేఅవుట్‌లో మినీబైపాస్ వద్ద నిర్మాణంలో ఉన్న భవనం అనుమతులు లేకుండా అదనపు అంతస్తులు కడుతున్నారని క్షేత్ర స్థాయిలో పరిశీలించిన ఆయన స్థానిక సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ కల్యాణ్, టీపీబీవో మురళి, ఏసీపీ వేణుకు షోకాజు నోటీసులిచ్చారు. 22వ డివిజన్‌లోని సిద్ధార్థ కాలేజీ వద్ద అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనాన్ని గుర్తించిన కమిషనర్, అందుకు కారణమైన ప్లానింగ్ సెక్రటరీ కేశవనాథ్, టీపీబీవో భరత్‌కుమార్‌రెడ్డికి షోకాజు నోటీసులిచ్చారు. వీరంతా మూడు రోజుల్లోపు వివరణ ఇవ్వకపోతే తదుపరి చర్యలుంటాయని హెచ్చరించారు. ఉమ్మారెడ్డిగుంటలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న కట్టడాలను ఆపేయాలని, ఇస్కాన్‌సిటీలో కాలువపై నిర్మిస్తున్న దుకాణాలను తొలగించాలని సిటీప్లానింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం తన కార్యాలయంలో దివ్యాంగులు, వృద్ధులు 12 మందికి టిడ్కో ఇళ్లను కేటాయిస్తూ ఉత్తర్వులు అందచేశారు.



టిడ్కో ఇల్లు కేటాయిస్తూ వృద్ధుడికి ఉత్తర్వు కాపీని అందచేస్తున్న కమిషనర్ నందన్

ఇల్లు కోల్పోయిన కుటుంబానికి ఆర్థిక సాయం

నెల్లూరు (వెంకటేశ్వరపురం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షాలకు నగరంలోని వెంకటేశ్వరపురం పరిధి అలీనగర్‌లో ఇల్లు కూలిపోయిన కుటుంబానికి గురువారం స్థానిక టీడీపీ నాయకు లు ఆర్థిక సాయం అందజేశారు. నగర ఎమ్మెల్యే, మంత్రి నారాయణ సహకారంతో బాధితురాలు పర్వీన్‌కు రూ.20వేలు అందజేశారు. అనంతరం ఇస్లాంపేటలోని షర్ఫూన్ ఇంటి గోడ కూలిన ప్రాంతాన్ని పరి శీలించారు. ఈ కార్యక్రమాల్లో టీడీ పీ క్లస్టర్ ఇన్‌చార్జి జహీర్, అధ్యక్షుడు షాహీద్, కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యుడు జమీర్, నాయకులు మణి, వాసు, సుభానీ తదితరులు పాల్గొన్నారు.



నగదును అందజేస్తున్న జహీర్, షాహీద్

'అపోలో'లో క్యాన్సర్‌పై అవగాహన

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని అపోలో ఆసుపత్రిలో చెక్ ఓలేట్ పేరుతో క్యాన్సర్ వ్యాధిపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ ప్రసాద్‌రెడ్డి, డాక్టర్ హరిత తెలిపారు. గురువారం ఆసుపత్రిలో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. వారు మాట్లాడుతూ అక్టోబర్ మాసాన్ని కేన్సర్ అవగాహన మాసంగా జరుపుకుంటారని వెల్లడించారు. ప్రతీ స్త్రీ తన ఆరోగ్య సంరక్షణ కోసం ఒక్క క్షణం కేటాయిస్తే జీవితం చాక్లెట్ కంటే తీయగా ఉంటుందన్న ఉద్దేశంతో చెక్ ఓలేట్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆసుపత్రిలో క్యాన్సర్ వ్యాధికి అత్యాధునిక వైద్య చికిత్సలు అందిస్తున్నామని, తక్కువ ఫీజుతోనే స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు.



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీరామ్ సతీష్



విద్యార్థులకు తుపాకులు చూపించి, వాటి గురించి వివరిస్తున్న పోలీసులు



గన్ పనితీరును వివరిస్తున్న సిబ్బంది



పిస్తోళ్లు భలే ఉన్నాయ్..

గన్.. అదిరెన్!

● ఆకట్టుకున్న పోలీస్ ఓపెన్ హౌస్
● ఆసక్తిగా తిలకించిన విద్యార్థులు

ఒక వైపు పెద్ద గన్.. ఆ పక్కనే చిన్న తుపాకీలు.. ఇంకోవైపు రైఫిల్స్.. వాటి తర్వాత బాంబ్ డిస్పోజల్స్... పోలీసు శాఖ ఉపయోగించే ఈ ఆయుధాలు, పరికరాలు విద్యార్థులను అబ్బురపరిచాయి. పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం నెల్లూరులోని పోలీసు కవాతు మైదానంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఏఎస్పీ సీహెచ్ సౌజన్య దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీసు శాఖ ఉపయోగించే రకరకాల తుపాకులు, ఆయుధాలు, డ్రోన్లు, బాంబులను నిర్వీర్యం చేసే సామగ్రి, ఇతర పరికరాలను ప్రదర్శించారు. వాటి పని తీరును పోలీసు సిబ్బంది వివరించారు. అలాగే డాగ్ స్క్వాడ్, ట్రాఫిక్ విభాగం, విపత్తుల సమయంలో పోలీసులు ఉపయోగించే కమ్యూనికేషన్ వ్యవస్థ, బులెట్ ప్రూఫ్ వెహికల్, కమ్యూనికేషన్ వాహనం, 207 వజ్ర వాహనం, మెటల్ డిటెక్టర్, డ్రాగన్ లైట్, రాకర్, ఫింగర్ ప్రింట్స్, కమ్యూనికేషన్ మ్యాన్‌ప్యాక్ట్ సెట్స్, సెల్ జామర్ వాహనాలు... ఇలా అనేక అంశాలపై అవగాహన కల్పించారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు వాటిని ఎంతో ఆసక్తిగా తిలకించారు. పోలీసు అమరవీరుల త్యాగాలను సిబ్బంది వివరించారు. మంచి లక్ష్యంతో ఉన్నత స్థాయికి ఎదిగి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు, సీఐలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు

- నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి)



బాంబులు నిర్వీర్యం చేసే పరికరాలు ఇవేనండోయ్!





శిక్షణ పొందిన పోలీసు జాగిలాలు

నేటి నుంచి వేదగిరిలో పవిత్రోత్సవాలు

నెల్లూరురూరల్,అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఏటా నిర్వహించే వేదగిరి పవిత్రోత్సవాలు శుక్రవారం నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయని, ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ట్రస్టు బోర్డు చైర్మన్ ఇందుపూరు అచ్యుత్ శంకర్‌రెడ్డి తెలిపారు. ఆగమోక్తంగా జరిగే నిత్య, వార, మాస, నక్షత్ర అర్చన, స్నపన, ఉత్సవ, విశేష పూజాదుల్లో తెలిసీ, తెలియని దోషాలను ఈ పవిత్రోత్సవాల ద్వారా తొలగించుకుంటారని, తిరిగి ఆలయ పవిత్రతకు భంగం లేకుండా స్వామి, అమ్మవార్ల సన్నిధిలో విశేష పూజలను యధావిధిగా నిర్వహిస్తారని ఆయన వివరించారు. నవంబరు 3 వరకు ఈ పవిత్రోత్సవాలను అర్చక, రుత్వికుల సమక్షంలో యాగాలు, యజ్ఞానాలతో నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. విశేష హోమాలు అనంతరం స్వామివారికి పవిత్రాలు సమర్పణ ఉంటుందని తెలిపారు.

బాలికపై లైంగిక దాడి కేసులో పెంపుడు తండ్రికి జీవిత ఖైదు

● రూ.40 వేల జరిమానా

నెల్లూరు (లీగల్), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : బాలికపై పెంపుడు తండ్రే లైంగిక దాడికి పాల్పడ్డాడన్న కేసులో నేరం రుజువు కావడంతో సర్వేపల్లి అంజయ్య అనే నిందితుడికి జీవిత ఖైదు, రూ.40 వేల జరిమానా విధిస్తూ నెల్లూరు జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి సిరిపిరెడ్డి సుమ గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.... ఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటగిరి పట్టణం బంగారుపేట గ్రామం అరుంధతీయ పాలెంకు చెందిన సర్వేపల్లి అంజయ్యకు ఓ వివాహితతో పరిచయం అయింది. ఆమెకు తనే తండ్రిగా వ్యవహరించేవాడు. అయితే ఆ పిల్లల్లో 15 ఏళ్ల బాలికపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీనిపై సదరు బాలిక 2021 జూలై 19వ తేదీన ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటగిరి పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీ చంద్రశేఖర్ వాదించారు.

నిండుకుండలా నక్కలగండి



వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కలగండి రిజర్వాయర్‌లోకి వరద నీరు ఉధృతంగా వస్తుండడంతో గురువారం నిండుకుండలా మారి జలకళను సంతరించుకుంది. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు చేరడంతో పూర్తిస్థాయి సామర్థ్యం 22 అడుగుల మేర నీరు చేరింది. నీటిని ఏమాత్రం వృథా కాకుండా అధికారులు చర్యలు చేపట్టి పంటల సాగుకు సహరించాలని రైతులు కోరుతున్నారు.



డ్రెడ్జింగ్ పడవను ఒడ్డుకు చేర్చేందుకు శ్రమిస్తున్న రెస్క్యూ బృందాలు

● బీరాపేరు ప్రవాహంపై అవగాహనలేని ఏజెన్సీ
● నీటిలో కొట్టుకొచ్చిన మూడు డ్రెడ్జింగ్ పడవలు
● వీటి గురించి పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు
● బ్యారేజీకి త్రుటిలో తప్పిన ప్రమాదం
● ఇటు యంత్రాంగం, అటు రైతాంగంలో ఉత్కంఠ
● 2వ రోజు విజయవంతంగా ఒడ్డుకు చేర్చిన బృందాలు

నిర్లక్ష్యం.. అవగాహన లోపం

సంగం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పెన్నా నదిలో నీటిలో ఇసుకను తీసే డ్రెడ్జింగ్ పడవల ఏజెన్సీ అవగాహనలోపం.. ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం జిల్లా యంత్రాంగం, అటు రైతాంగంలో ఉత్కంఠ రేపింది. 25 నుంచి 35 టన్నుల బరువుండే మూడు డ్రెడ్జింగ్ పడవలను (సుమారు 100 టన్నుల) తుఫాన్ హెచ్చరికతో నిర్వాహకులు బీరాపేరు వంతెన రైయిలింగ్‌కు మోకులతో కట్టేశారు. భారీ వర్షాలు వస్తే ఎగువ ప్రాంతం నుంచి బీరాపేరుకు భారీస్థాయిలో నీటి ప్రవాహం ఉంటుందని తెలిసిన స్థానిక ఇరిగేషన్ అధికారులు రైయిలింగ్‌కు కట్టిన భారీ పడవల గురించి పట్టించుకోలేదు. కొట్టుకొచ్చిన పడవలు నీటి ప్రవాహంలో మధ్యలో నిలిచిపోబట్టి బ్యారేజీకి పెను ముప్పు తప్పింది. ఒక్కొక్కటి 30 టన్నుల బరువుండే పడవలకు నీటి వేగం తోడై బ్యారేజ్ ప్రియర్స్‌నుగానీ, గేట్లనుగానీ ఢీకొని ఉంటే పరిస్థితి ఏమిటని రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తోంది.

● జిల్లా యంత్రాంగంలో హైటెన్షన్

పడవలు కొట్టుకొచ్చిన విషయం తెలిసిన వెంటనే బుధవారం కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ అజితా వేజెండ్ల హుటాహుటిన సంఘటన స్థలానికి వచ్చి అధికారులతో సమీక్షించారు. సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో భారీగా వస్తుండగా, అదే ప్రవాహాన్ని సంగం బ్యారేజీకి విడుదల అవుతోంది. ఇదే క్రమం లో బీరాపేరు ఉధృతంగా ప్రవహిస్తుంది. వీటన్నిటి దృష్ట్యా మధ్యలో ఇరుక్కున్న పడవలను 24 గంటల్లో బయటకు తీయాలి. లేకపోతే బ్యారేజీకి ముప్పు ఏర్పడే అవకాశం ఉంది. ఇది జిల్లా యంత్రాంగానికి సవాల్‌గా మారింది.



వంతెన రైయిలింగ్‌కు కట్టిన పడవ

● రక్షణ బృందాలు రంగంలోకి..

కలెక్టర్, ఎస్పీలు వెంటనే రెవెన్యూ, పోలీస్, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, మత్స్య, అగ్నిమాపక శాఖలు, సముద్రంలో పడవలో చేపల వేట సాగించే నైపుణ్యం ఉన్న మత్స్యకారులను రంగంలోకి దింపారు. ఆ మేరకు ఆయా బృందాలు పడవను గట్టుకు తీసుకురావడం వీలుపడకపోతే అక్కడి నుంచి కదలకుండా స్థిరంగా ఉంచేందుకు చర్యలు చేపట్టే ప్రయత్నం చేశారు. పెన్నానదిలో 11.6 అడుగుల నీటిమట్టంతో 86వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉండడంతో వారధి క్రస్ట్ వద్ద ఆగి ప్రమాదకరంగా ఉన్న పడవ వద్దకు సమీపంలోకి వెళ్లేందుకు విశ్వప్రయత్నం చేశారు. కానీ కుదరలేదు.

● 2వ రోజు విజయవంతంగా..

సోమశిల నుంచి నీటి ప్రవాహం తగ్గించడంతో సంగం బ్యారేజ్ వద్ద నీటి ప్రవాహం గురువారం ఉదయానికి 86వేల నుంచి 59 వేలకు తగ్గింది. దీంతోపాటు బీరాపేరు నీటి ప్రవాహం కూడ కాస్త తగ్గింది. దీన్ని ఆసరాగా చేసుకుని పెన్నానదిలో నీటి ప్రవహించకుండా గేట్లన్నీ దించేచి మధ్యంలో ఆగిపోయిన డ్రెడ్జింగ్ పడవలను ఆపరేషన్ బృందాలతో అతికష్టం మీద సురక్షిత ప్రాంతానికి తరలించారు.

● అభినందించిన మంత్రులు

సంగం బ్యారేజీని రక్షించడంతోపాటు పడవలను సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక, మత్స్య శాఖ, ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగంతో టీమ్ వర్క్‌తో విజయం సాధించిన కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ అజితా వేజెండ్ల, రెస్క్యూ టీమ్ బృందానికి రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ట్విట్టర్‌లో అభినందించారు. అదేవిధంగా హోమ్ మంత్రి అనిత పోలీస్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పావని, డీఎస్పీ వేణుగోపాల్, ఇరిగేషన్ ఎస్ఈ రాధాకృష్ణ, వెంకటరమణారెడ్డి, తహసీల్దారు సోమ్లానాయక్, ఈఈ మేకల అనీల్‌రెడ్డి, డీఈ విజయరామిరెడ్డితోపాటు సంగం, ఆత్మకూరు సీఐలు వేమారెడ్డి, గంగాధర్‌తోపాటు మత్స్య శాఖ జేడీ శాంతి, ఎఫ్‌డీవో పొట్టెయ్య, సంగం, ఏయస్‌పేట, ఆత్మకూరు, చేజర్ల, కలువాయి, రాపూరు ఎస్ఐలు తదితరలు పాల్గొన్నారు.

మాలేపాటి అకాల మరణం జీర్ణించుకోలేం

● నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి
● ఉత్తరక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు, ప్రముఖులు



ప్రసంగిస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, పక్కన రాజ్యసభ సభ్యుడు మస్తాన్‌రావు, ఎమ్మెల్యేలు తదితరులు

దగదర్తి (బిట్రగుంట) అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు, టీడీపీ యువనేత భానుచందర్ నాయుడు అకాల మరణం జీర్ణించుకోలేనిదని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. దగదర్తిలోని మాలేపాటి స్వగృహంలో సుబ్బానాయుడు, భానుచందర్‌ల ఉత్తరక్రియలు గురువారం జరిగాయి. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కాకర్ల సురేష్, ఇంటూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తదితర ప్రముఖులు తరలివచ్చారు. తొలుత సుబ్బానాయుడు, భానుచందర్‌ల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి మాలేపాటి కుటుంబ సభ్యులు ఎనలేని సేవలందించారని వారితో ఉన్న అనుబంధాన్ని నేతలు నెమరువేసుకున్నారు. అటువంటి నేతలను కోల్పోవడం దురదృష్టకరమని, వారు లేని లోటు పార్టీకి తీర్చలేనిదని అన్నారు. అనంతరం మాలేపాటి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్య నాయుడు, కావలి ఏఎంసీ చైర్‌పర్సన్ అలేఖ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ దేవరాల సుబ్రహ్మణ్యం, సోమశిల ప్రాజెక్ట్ కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు 9 వరకు గడువు

తిరుపతి(విద్య), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సైనిక్ స్కూల్ ప్రవేశాలకు నిర్వహించే జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షకు నవంబర్ 9వ తేదీ వరకు గడువు పొడిగించారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రం అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరానికి 6, 9 తరగతుల్లో ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష వచ్చే ఏడాది జనవరి 18వ తేదీన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వయసును బట్టి 4 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న బాలబాలికలకు ఈ పరీక్షకు అర్హత ఉంటుందని వెల్లడించారు. దరఖాస్తు విధానం, అర్హతలు, పరీక్ష విధానం గురించి పూర్తి వివరాలు తెలుసుకునేందుకు 86888 88802, 93999 76999లలో తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం సైనిక్ - నవోదయ పోటీ పరీక్షల శిక్షణా కేంద్రాన్ని సంప్రదించవచ్చని తెలిపారు.

పోలీసుల కొవ్వొత్తుల ర్యాలీ

నెల్లూరు(క్రైం),(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీసు వీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ పోలీసు శాఖ ఆధ్వర్యంలో నగరంలో కొవ్వొత్తుల ర్యాలీ జరిగింది. పోలీసు పరేడ్ మైదానం నుంచి కేవీఆర్ పెట్రోల్ వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల మాట్లాడుతూ విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీసులను స్ఫూర్తిగా తీసుకొని పనిచేయాలన్నారు. ఈ ర్యాలీలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి రజక వృత్తిదారుల తరగతులు



పెన్నా నదీ తీరంలో రజకులతో మాట్లాడుతున్న సంఘం నాయకులు

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జక్కా వెంకయ్య భవన్‌లో శని, ఆదివారాల్లో రాష్ట్ర స్థాయి రజక వృత్తిదారుల చైతన్య తరగతులు జరుగుతాయని రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి రేకులగుంట అంకయ్య తెలిపారు. వీటిని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని పెన్నా నది వద్ద దుస్తులు ఉతుకుతున్న రజకులను సంఘం నాయకులు కలిశారు. రజక కార్పొరేషన్ ద్వారా ఆదరణ పథకం కింద ఆధునిక పనిముట్లు అందచేస్తామని, 50 ఏళ్లకే పింఛను అందజేస్తామనిఇ ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. వాటిని వెంటనే నెరవేర్చాలని, లేదంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఓడూరు వెంకట కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు నిత్యావసరాల పంపిణీ



కావలిలో బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న మంత్రి ఫరూక్, ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి

కావలి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలతో ముంపునకు గురైన టిడ్కోకాలనీ వాసులకు రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న నిత్యావసరాలను గురువారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఫరూక్, ఎమ్మెల్యే వెంకట కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు తమ సమస్యలను ఏకరవుది పెట్టారు. త్వరలో అన్ని సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కావలి ఆర్డీవో ఎం. సన్నీ వంశీక్రిష్ణ, మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ తహసీల్దార్ పీ. శ్రావణ్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ అలేఖ్య, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

● బంగాళదుంప, ఉల్లి దిగుమతి

నెల్లూరు (వ్యవసాయం) : మొంథా తుపాను బాధితులను ఆదుకునేందుకు మార్కెటింగ్ శాఖ బంగాళా దుంపతోపాటు ఉల్లిపాయలను అందించేందుకు పౌరసరఫరాల శాఖకు గురువారం సరఫరా చేసింది. 17,253 కేజీల బంగాళాదుంప, 17,253 కేజీల ఉల్లిపాయలను సివిల్ సప్లయిస్ గోదాములకు తరలించినట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ అనిత తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మత్స్యకారులు, షెల్టర్ల కింద జీవిస్తున్న ఒక్కొక్కరికి కేజీ చొప్పున అందించనున్నట్లు ఏడీ పేర్కొన్నారు.

చేనేతలను ప్రభుత్వం ఆదుకోవాలని వినతి



ఇన్‌చార్జి ఏడీకి వినతిపత్రం ఇస్తున్న చేనేత ఐక్యకార్యాచరణ కమిటీ నాయకులు

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):తుఫాను కారణంగా నష్టపోతున్న ప్రతి చేనేతను ప్రభుత్వం ఆదుకోవాలని చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా అధ్యక్షుడు బుధవరపు బాలాజీ కోరారు. చేనేత జౌళిశాఖ ఇన్‌చార్జి ఏడీ రమేష్‌తో కలిసి గురువారం ఆయన నారాయణరెడ్డిపేటలోని చేనేత మగ్గాలను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా దాదాపుగా 4వేల కుటుంబాలు చేనేత వృత్తిపై ఆధారపడి జీవన సాగిస్తున్నారన్నారు. ఉపవృత్తుల మీద మరో 5వేల కుటుంబాలు ఉన్నాయని, తుఫాను కారణంగా మగ్గం గుంతల్లో నీరు చేరడంతో వీరంతా పని కోల్పోయారని చెప్పారు. నష్టపోయిన రైతులను, మత్స్యకారులను ఆదుకున్నట్లుగానే చేనేతలను కూడా ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామనాథం రాజశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ సోమా గోపాల్, ఉపాధ్యక్షుడు రామసుబ్బయ్య, కార్యదర్శి వెంకటరమణయ్య, చేనేత మహిళలు పాల్గొన్నారు.

మినుములో కలుపు నివారణ

● లేకుంటే పంట దిగుబడుల ప్రభావం ● కేవీకే విస్తరణ విభాగం శాస్త్రవేత్త లోకేష్‌బాబు

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మినుము పైరులో కలుపు నివారణ చర్యలు తీసుకోవాలని, లేదంటే పంట దిగుబడులపై ప్రభావం పడుతుందని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.లోకేష్‌బాబు తెలిపారు. విత్తనశుద్ధి చేయడం వల్ల తెగుళ్లు, రసం పీల్చే పురుగుల బారి నుంచి పంటను రక్షించుకోవచ్చని ఆయన వివరించారు. మినుము సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన ఆంధ్రజ్యోతి ద్వారా రైతులకు తెలియజేశారు.మినుము పైరులో కలుపు నివారణకు విత్తిన మరుసటి రోజు ఎకరాకు 1 నుంచి 1.5లీటర్ల నీటిలో పెండిమిథాలిన్ 30శాతం ద్రావణాన్ని పిచికారీ చేయాలి. విత్తిన 20 నుంచి 25 రోజుల తరువాత గొర్రుతో అంతర్ కృషి చేయాలి. మాగాణి మినుములో ఊద, చిప్పుర, గరిక వంటి గడ్డి జాతి కలుపు మొక్కలను నివారించేందుకు పొలంలో తేమ ఉన్నప్పుడు ఫినాక్సీప్రాప్ ఇథైల్ 9శాతం ఎకరాకి 250 మి.లీ లేదంటే క్విజలోఫాప్ ఇథైల్ 5శాతం ఎకరాకి 400మి.లీ మందును 200లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఇలా చేయడం వల్ల గడ్డి కలుపు నియంత్రణ సమర్థవంతంగా జరుగుతుంది. అలాగే వెడల్పాటి గడ్డిజాతి కలుపు ఉన్నప్పుడు ఇమజితాపిర్ 5శాతం ద్రావకం 200 మి.లీ 200లీటర్ల నీటిలో కలిపి 20 నుంచి 25 రోజుల్లో పిచికారీ చేయాలి. తేమ ఉన్న సమయంలోనే పిచికారీ చేయాలి. ఇంకా వరి మాగాణి పొలాల్లో బంగారు తీగ నియంత్రణ కోసం వరి పనలు తొలగించిన వెంటనే ఎకరాకు 1.5 లీటర్ల పెండిమిథాలిన్ 30శాతం మందును 20కిలోల ఇసుకలో కలిపి సాయంత్రం సమయాన పొలంలో సమానంగా చల్లాలి. బంగారు తీగ కనిపిస్తే పారాక్వాట్ 10శాతం ద్రావకాన్ని లీటరు నీటికి 5మి.లీను కలిపి తీగ ఉన్నచోట పిచికారీ చేయడం వల్ల పంటను కాపాడుకోవచ్చు.

రేపు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఉదయగిరి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు భారత రాజ్యాంగంపై వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు మండల స్థాయిలో నిర్వహించనున్నట్లు ఎంఈవో-1 టీ వెంకటేశ్వర్లు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని జడ్పీ ఉన్నత, ప్రభుత్వ, గండిపాళెం గురుకుల పాఠశాలల్లో పాఠశాలల స్థాయిలో జరిగిన పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు మండల స్థాయి పోటీలకు తీసుకురావాలని ఆయన సూచించారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11477
వెండి కిలో ధర	రూ. 152000
వెండి ఒక గ్రాము	రూ. 158.00

తుఫాన్ బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ



ఆత్మకూరు: తుఫాన్ బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్



ఉదయగిరి: గిరిజనులకు నిత్యావసరాలు అందజేస్తున్న తహసీల్దారు రామ్మోహన్



వరికుంటపాడు: వరద బాధితులకు ఇంటి సరుకులు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు, అధికారులు


ఆత్మకూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలో తుఫాన్ బాధితులకు, మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం అందజేసిన నిత్యావసర సరుకులను రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాల మేరకు గురువారం మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న ప్రతి కుటుంబానికి 25 కేజీల బియ్యం, నూనె, కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళ దుంపలు, చక్కెర పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. అదే క్రమంలో ప్రతి కుటుంబానికి రూ. 1000 నుంచి రూ. 3000 ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ దగుమాటి శివకోటారెడ్డి, టీడీపీ నాయకులు తుమ్మల చంద్రారెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు తదితరులు పాల్గొన్నారు.

●**ఉదయగిరి:** మండలంలోని బండగానిపల్లి పంచాయతీ కొత్తపల్లి గిరిజన కాలనీ వాసులకు తహసీల్దారు ఎల్ రామ్మోహన్, టీడీపీ మండల కన్వీనర్ చింతనబోయిన బయ్యన్నలు గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొంథా తుఫాన్ కారణంగా కాలనీ వాసులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించడం జరిగిందన్నారు. పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందిన 26 కుటుంబాలకు ప్రభుత్వ సూచన మేరకు బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులను పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అబ్బాస్‌ఖాన్, వీఆర్వోలు మాలకొండయ్య, చెన్నకృష్ణయ్య, సీపీఎం, టీడీపీ నాయకులు కాకు వెంకటయ్య, ఈర్ల శంకర్, వెంకటం^మణయ్య, కొండా చినచెంచురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

●**వరికుంటపాడు (ఉదయగిరి రూరల్):** మొంథా తుఫాను ప్రభావంతో స్థానిక ఉన్నత పాఠశాలలోని పునరావాస కేంద్రాల్లో ఉన్న బాధితులకు గురువారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు కేంద్రంలోని 25 కుటుంబాలకు బియ్యం, కంది పప్పు, నూనె, పంచదార, యర్రగడ్డలు, బంగాళదుంపలు వంటి నిత్యావసర సరుకులను పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే ఆయా కుటుంబాలకు త్వరలోనే రూ. 3వేలు చొప్పున నగదు కూడా అంద జేయడం జరుగు తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు హేమంత్ కుమార్, ఎంపీడీవో రమణారెడ్డి, జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌యాదవ్, సొసైటీ చైర్మన్ గుర్రం గోపి, యూనిట్ ఇన్‌చార్జి నాదెండ్ల రాజేంద్ర, గ్రామ పార్టీ అధ్యక్షుడు పొద మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

21 అడుగులకు చేరిన గండిపాళెం నీటిమట్టం



గండిపాళెంకు చేరిన వరద నీరు

ఉదయగిరి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం జలాశయ నీటి మట్టం 21 అడుగులకు చేరిందని జలనవరుల శాఖ డీఈ కందుకూరి చంద్రమౌళి గురువారం తెలిపారు. జలాశయం పూర్తి నీటి సామర్థ్యం 35 అడుగులు కాగా ప్రస్తుతం 21 అడుగులకు చేరిందన్నారు. జలాశయం పైతట్టు ప్రాంతంలో పిల్లాపేరు, దున్నపోతుల వాగులతోపాటు పలు చెరువులు అలుగులు పారుతుండడంతో జలాశయంలోకి 800 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోందన్నారు. దీంతో నీటిమట్టం ఇంకా పెరిగే అవకాశముందని తెలిపారు.

పాఠశాలల పరిశీలన

ఉదయగిరి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల బాధ్యత ఉపాధ్యాయులదేనని ఎంఈవోలు టీ వెంకటేశ్వర్లు, టీ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం మండలంలోని మాసాయిపేట మెయిన్, హరిజనవాడ ప్రాథమిక, పట్టణంలోని నార్త్ పాఠశాలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం సంబంధిత రిజిస్టర్లు, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కాపాడాలి

అనంతసాగరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్తాపురం, పాతాళపల్లి గ్రామాల పరిధిలో ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతూ మాజీ నీటి సంఘం సభ్యుడు శ్రీమన్నారాయణ తహసీల్దారు జయవర్ధన్, ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్‌కు గురువారం విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు గ్రామాల పరిధిలో ప్రభుత్వ భూములు ఆక్రమించి సాగు చేస్తుంఁడడంతో పశువులు తిరిగేందుకు కూడా జాగా కరువైందని, ఇళ్లస్థలాలు బినామీ పేర్లతో పొందారని ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురి కాకుండా చూడాలని కోరారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

ఉదయగిరి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ పోలీసు సంస్మరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఉదయగిరి సీఐ ఎన్ వెంకటరావు గురువారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల, కావలి డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగే ఈ రక్తదాన శిబిరాన్ని నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభిస్తారన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలోని పోలీసు అధికారులు, సిబ్బంది సంయుక్తంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో రక్తదాతలు, నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రేపు నూతన విగ్రహ ప్రతిష్ఠ

ఆత్మకూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దూపూరు గ్రామంలో శనివారం నుంచి శ్రీ సీతాలక్ష్మణ హనుమాన్ సమేత కోదండరామస్వామి వార్ల నూతన విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించబడతాయని, చివరి రోజు సోమవారం ఉదయం సీతారాముల కల్యాణం జరుగుతుందని, భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

వైసీపీ కోటి సంతకాల సేకరణ

ఉదయగిరి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హరిజనవాడలో గురువారం వైసీపీ నాయకులు కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు దస్తగిరిఅహ్మద్, షంషీర్, ఏఎం సలీం, గడ్డం రాజా, గోగుల రామయ్య, బెజవాడ నానాజీ, నాగిళ్ల గోవింద్, మట్ల హరి తదితరులు పాల్గొన్నారు.

●**సీతారామపురం :** స్థానిక బస్టాండ్ సెంటర్‌లో వైసీపీ మండల కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల ఉపాధ్యక్షుడు రామిశెట్టి తిరుపతయ్య, చింతంరెడ్డి వెంకటేశ్వర్లు, మాబయ్య, ముద్దుక్రిష్ణ , దనార్జన్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లలితా రుద్ర మహాయజ్ఞం



కాశీవిశ్వేశ్వరుడికి హారతులిస్తున్న రాజరాజేశ్వరానందస్వామి

సంగం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరుమనకొండలో ఉన్న రాజరాజేశ్వరీదేవి సమేత కాశీవిశ్వేశ్వరాలయ జ్ఞానపీఠంలో జరుగుతున్న లలిత రుద్ర మహాయజ్ఞం గురువారం 39వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు : ఎంవీఐ



ప్రైవేట్ బస్సును తనిఖీ చేస్తున్న ఎంవీఐ రాములు

ఏఎస్‌పేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ బస్సుల యాజమానులు నిబంధనలు పాటించకపోతే చట్టరీత్యా చర్యలు తప్పవని ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాములు హెచ్చరించారు. గురువారం ఆయన ఏఎస్‌పేటకు విచ్చేసి దొరసానమ్మ తోటలో ఏఎస్‌పేట నుండి హైదారాబాదుకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్న ప్రైవేట్ బస్సులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్సుల కండిషన్, పత్రాలను పరిశీలించారు. బస్సులు నడిపే ముందే సాంకేతిక లోపాలు లేకుండా చూసుకోవాలని సూచనలు అందించారు.

తెలుగు, గణితంలో విద్యార్థులు రాణించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో షేక్ మస్తాన్‌వలి

సీతారామపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలుగు, గణితంలో విద్యార్థులు రాణించాలని ఎంఈవో షేక్ మస్తాన్‌వలి సూచించారు. ఆయన మండల పరిధిలోని రంగనాయుడుపల్లి ప్రాథమిక పాఠశాల, ఉర్దూ పాఠశాలలను గురువారం సందర్శించి విద్యార్థుల మూల్యాంకన పుస్తకాలను పరిశీలించారు. అలాగే తెలుగు గుణింతాలు సులభంగా పిల్లలకు ఎలా నేర్పించాలో వివరించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుభాని, సీఆర్‌పి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన అవసరం

దుత్తలూరు(ఉదయగిరి), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దారు యనమల నాగరాజు పేర్కొన్నారు. గురువారం మంలంలోని మండాలపల్లి ఎస్టీ కాలనీలో పౌరహక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరహక్కులకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని పిల్లలను బాగా చదివించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి మదన్‌మోహన్, డిప్యూటీ ఎంపీడీవో మల్లికార్జున, ఎంఈవో వెంగయ్య, నర్రవాడ వార్డెన్ రామ్మూర్తి, మండల సర్వేయర్ శివ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కోటి సోమవారం పూజలు



శివాలయంలో పూజలందుకుంటున్న విశ్వేశ్వరస్వామి

ఆత్మకూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): శివుడికి అత్యంత ప్రీతికరమైన కార్తీక మాసం, కోటి సోమవారం సందర్భంగా గురువారం ఆత్మకూరులోని శివాలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం కార్తీక దీపాలు వెలిగించారు. ఆత్మకూరు పట్టణం లోని శివాలయం, వెంకటేశ్వరస్వామి ఆలయం, అభయాంజనేయస్వామి, కన్యకా పరమేశ్వరి, అలఘనాథస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయంలో అయ్యప్ప భక్తులు భజనలు చేశారు. ఆత్మకూరు పట్టణంలోని ప్రధాన రహదారిలో ఉన్న షిరిడీ సాయిబాబా ఆలయంలో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వ హించి భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు.

గోళ్ల రమేష్ కుటుంబానికి ఆర్థిక సాయం



రమేష్ తల్లికి నగదు అందజేస్తున్న బొల్లినేని

వింజమూరు, అక్టోబరు 30 (ఆం ధ్రజ్యోతి): కర్నూలు వద్ద ఇటీవల జరిగిన బస్సు ప్రమాదంలో మృతి చెందిన గోళ్ల రమేష్, ఆయన తండ్రి గోళ్ల మాలకొండయ్య కుటుం బ సభ్యులను మాజీ ఎమ్మెల్యేలు బొల్లినేని వెంకటరామారావు, మేక పాటి చంద్రశేఖర్‌రెడ్డిలు గురువారం పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబానికి బొల్లినేని వెంకటరామారావు లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలి

సంగం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీడీవో షాలెట్ ఆధ్వర్యంలో ఎంపీపీ పద్మావతమ్మ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుయస్, వ్యవసాయశాఖ, విద్యాశాఖ, ఎన్‌ఆర్‌ఈజీఎస్, డీఆర్‌డీఏ వెలుగు తదితర శాఖలపై సమీక్ష జరిగింది. ఎంపీడీవో షాలెట్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా తాగునీరు కలుషితం కాకుండా మంచినీటి పథకాలను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఉపాధి హామీలో కొత్త పనులకు ప్రతిపాదనలు పంపితే మంజూరు చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులతోపాటు, సర్పంచ్‌లు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటల పరిశీలన



అనంతసాగరం: వర్షాలకు దెబ్బతిన్న వరి పైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు


అనంతసాగరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న వరిపంటను వ్యవసాయ శాస్త్రవేత్తలు గురువారం పరిశీలించారు. చిలకలమర్రి, బొమ్మవరం, చాపురాళ్లపల్లి గ్రామాలను సందర్శించి పంట నష్టంపై నివేదికలు తయారుచేశారు. ఆలస్యంగా సాగు చేసేటప్పుడు 120 రోజులకు చేతికందే సాగు రకాలు విత్తుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నెల్లూరు వ్యవసాయ పరిశోధన ప్రధాన శాస్త్రవేత్తలు పరమశివ, మధుసూధన్ రావు, లక్ష్మీ, సాగరం ఏవో శైలజాకుమారి పాల్గొన్నారు.

●**మర్రిపాడు:** ఆచార్య రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞానకేంద్రం నెల్లూరు శాస్త్రవేత్తలు లలిత, శివజ్యోతి కిరణ్‌కుమార్‌రెడ్డిల బృందం మర్రిపాడు మండలంలో దెబ్బతిన్న వరి పంటలను గురువారం సందర్శించారు. కోత దశలో ఉన్న వరిలో లీటరు నీటికి 50గ్రా ఉప్పు కలిపి పిచికారీ చేసుకుంటే గింజలు మొలకెత్తకుండా నివారించవచ్చని, నారుమడులు త్వరగా పోసుకొని 90రోజులలో పంట వచ్చేలా ప్రణాళికతో సెప్టెంబరు చివరలో కోతలు కోయాలని వారు రైతులకు సూచించారు.

గ్రామ పంచాయతీల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు



వరికుంటపాడు : తూర్పుచెన్నంపల్లిలో పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది



ఉదయగిరి పట్టణంలో వాటర్‌ట్యాంకులు క్లోరినేషన్ చేస్తున్న సిబ్బంది

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), అక్టోబరు 30 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో గురువారం పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. మొంథా తుపాను ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామాలు మురికి కూపాలుగా మారాయి. ఈనేపథ్యంలో ప్రభుత్వం చేపట్టిన సూపర్ క్లోరినేషన్ - సూపర్ శానిటేషన్ కార్యక్రమంలో భాగంగా ప్రధాన వీధులు, నివాసాల ప్రాంగణాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించ డంతో పాటు దోమలు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్ చల్లించారు. తూర్పుచెన్నపల్లిలో పంచాయతీ కార్యదర్శి గడ్డం సంపూర్ణ, మహి ళా పోలీసు జుబేదాబేగం ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టి ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతిఒక్కరు అప్రమత్తంగా ఉండాలని హెల్త్ అసిస్టెంట్ యనమల శ్రీనివాసులు అన్నారు. గురువారం వరికుంటపాడులో ఆయన ఇంటింటి లార్వా సర్వే చేపట్టి నీటి నిల్వ ప్రాంతాలను శుభ్రం చేయించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడంతో పాటు దోమతెరలు వినియోగించి జాగ్రత్త చర్యలు పాటించాలని సూచించారు. అనంతరం మురికి, అపరిశుభ్రత ప్రాంతాల్లో మిలాథిన్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్త అలివేలుపాల్గొన్నారు.

వాటర్ ట్యాంకుల క్లోరినేషన్

●ఉదయగిరి : ఇటీవల విస్తారంగా వర్షాలు కురిసినందున పట్టణంలోని మంచినీటి పథకాలకు సంబంధించిన వాటర్ ట్యాంకుల్లో గురువారం అధికారులు సూపర్ క్లోరినేషన్ చర్యలు చేపట్టారు. పట్టణంలోని గ్రంథాలయం, యాదవ పాళెం, మంగళగిరి, ఎస్టీ, షబ్బీర్‌కాలనీల్లోని వాటర్‌ట్యాంకుల్లో క్లోరినేషన్ చేపట్టి ట్యాంకుల చుట్టూ పారిశుధ్యం మెరుగుకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో షేక్ కరీముల్లా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగన్నాథం, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని మహిళ మృతి



మంజులమ్మ (ఫైల్)

వెంకటాచలం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు రైలు ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన గురువారం ఉదయం వెంక టాచలం రైల్వే స్టేష న్‌లో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఇడి మేపల్లికి చెందిన రొండ్ల మంజులమ్మ (52) క్రైస్తవ ప్రార్థనల కోసం చెన్నై వెళ్లేందుకు మరికొందరితో కలిసి వెంకటాచలం రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. ఆ సమయంలో చెన్నై వైపు సూపర్ ఫాస్ట్ రైలు వెళ్తుండగా, ఆ వేగానికి ఆమె దుస్తులు తగులుకొని ప్రమాదవశాత్తు రైలు పట్టాలు, ప్లాట్‌ఫామ్ మధ్యలో పడిపోయింది. తీవ్రంగా గాయపడడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. గతంలో ఈమె అంగన్‌వాడీ కార్యకర్తగా కూడా పని చేశారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- 15 మంది అరెస్టు
- రూ.91 వేలు, వాహనాల స్వాధీనం

నెల్లూరు(క్రైం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని రాయపు పాలెం సమీప ఖాళీస్థలాల్లో గురువారం పేకాడుతున్న వారిపై బాలాజీ నగర్ పోలీసులు దాడి చేసి 15 మందిని అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ సాంబశివరావుకు అందిన సమాచారంతో ఆయన సిబ్బందితో కలిసి దాడి చేశారు. పేకాడుతున్న డీ రవికృష్ణ, డీ చంద్రమోహన్, కే రవి, షేక్ మస్తాన్, ఆర్ సుబ్బారావు, విజయ, జీ కృష్ణకాంత్, ఎస్ ఏలియా, పీ రత్నం, ఎం రమేష్, వీ సురేంద్ర, వీ సందీప్‌రెడ్డి, వేణు, జీ వెంకటేశ్వర్లు, కే రవిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.91,910 నగదు, ఆరు బైక్‌లు, కారు, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో ఎస్ఐ పుల్లారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎంపై అసభ్యకర పోస్టులు పెట్టారని కేసు

నెల్లూరు రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై ఎక్స్ వేదికగా అసభ్యకర పోస్టులు పెట్టారన్న ఫిర్యాదుతో బంగారు రాజు అనే వ్యక్తిపై నెల్లూరు రూరల్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. మీ బంగారు రాజు అనే ఖాతా ద్వారా బంగారురాజు అనే వ్యక్తి సీఎం, డిప్యూటీ సీఎంపై అసభ్యకరంగా పోస్టులు పెట్టినట్లు నగరానికి చెందిన బల్లి ప్రీతివర్ధన్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ వేణు తెలిపారు. బంగారు రాజు తన అడ్రస్సు కల్లూరుపల్లిగా పేర్కొన్నట్లు తెలిసిందని పేర్కొన్నారు.

చెరువులకు జలకళ

- సాగునీటికి ఢోకా లేనట్లే..



అలుగుపారుతున్న ఆత్మకూరు చెరువులో చేపలు పడుతున్న యువకులు

సంగం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లా లోని చెరువులన్నీ జలకళను సంతరించుకున్నాయి. జిల్లావ్యాప్తంగా 1007 చెరువులు ఉండగా, వీటి సామర్థ్యం సుమారు 54 టీఎంసీలు. ఈ చెరువుల కింద 3 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. మొన్నటి వరకు అడుగంటిన చెరువులు వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో 75 శాతం నీళ్లు చేరా యి. అంటే దాదాపు 39 టీఎంసీల నీరు చేరినట్టు అంచనా వేస్తున్నారు. 311 చెరువులు కలుజులు పారుతున్నాయి.

● **చెరువుల పటిష్టతకు చర్యలు**

ముంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు చెరువులకు గండ్లు పడకుండా అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు చేపడుతోంది. ఇప్ప టికే నిండిన చెరువుల్లో 30 శాతం నీటిని కలుజులతోపాటు తూముల ద్వారా నీటిని తరలించారు. పూర్తి సామర్థ్యం సంతరించుకున్న చెరువులకు గండ్లు పడకుండా చర్యలు ఇరిగేషన్ అధికారులు చేపడుతున్నారు. చెరు వులన్నీ పూర్తి సామర్థ్యంతో సంతరించుకుని రబీ సీజన్‌లో చెరువుల కింద 3 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు వీలు కలిగింది. ఇరిగేషన్ ఎస్ఈ దేశీనాయక్ మాట్లాడుతూ ప్రస్తుతం చెరువులకు ఎలాంటి ముప్పు లేదని, ఎక్కడైనా గండ్లు పడే అవకాశం ఉంటే రక్షణ చర్యలకు ఆదే శాలిచ్చినట్లు చెప్పారు. వచ్చే రబీ సీజన్‌లో చెరువుల కింద పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీటి ఢోకా లేదన్నారు.

యథాతథంగానే!

(5వ పేజీ తరువాయి)

ఉన్నాయి. వెనుకబడిన ఈ నియోజకవర్గంలో సత్వరం అభివృద్ధి పనులు చేపట్టాలన్నా, సమస్యలు పరిష్కరించాలన్నా మూడు డివిజన్ల అధికారులతో చర్చించాల్సి రావడం ఎమ్మెల్యేలకు కష్టతరంగా మారింది. ఈ పరిస్థితి గమనించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఉదయగిరి రెవెన్యూ డివిజన్ కోసం పట్టుపట్టారు. ప్రభుత్వానికి నివేదిక పంపారు. పలుసార్లు రాజధానికి వెళ్లి ప్రత్యేక రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం అభ్యర్థించారు. ఎట్టకేలకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఉదయగిరి ప్రత్యేక రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సానుకూల వాతావరణం ఏర్పడింది.

● **వసతులున్నాయా!?**

ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ చేసేందుకు తగిన వసతులు ఉన్నాయా... పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని కలెక్టరేట్ నుంచి స్థానిక రెవెన్యూ కార్యాలయానికి ఫోన్ చేసి వివరాలు అడిగారు. దీంతో అధికారులు రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఏర్పాటుకు పట్టణంలోని బాలికల వసతిగృహాన్ని పరిశీలించి అనువుగా ఉంటుందని సూచించారు. మిగిలిన వివరాతలు తెలియజేయడంతో కలెక్టరేట్ నుంచి ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు తెలిసింది.

అభివృద్ధికి అడుగులు పడ్డట్లే...

ఉదయగిరి రెవెన్యూ డివిజన్ ఏర్పాటైతే అభివృద్ధికి అడుగులు పడ్డట్లే. రైతులు, ప్రజలు సమస్యల పరిష్కారం సుదూర ప్రాంతాలకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సైతం డివిజన్ ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకొన్నారు.

\- చింతనబోయిన బయ్యన్న, ఉదయగిరి

తీరనున్న మెట్టవాసుల కల

ఉదయగిరి రెవెన్యూ డివిజన్ అయితే మెట్ట ప్రాంత వాసుల కల నెరవేరుతోంది. అనాదిగా అభివృద్ధికి నోచుకోని ఉదయగిరిని జిల్లా చేయాలని ఆరున్నరేళ్లుగా ఉద్యమం చేస్తున్నాం. భవిష్యత్తులో ఉదయగిరి జిల్లా అయ్యేందుకు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు తొలి మెట్టు కానుంది

\- డాక్టర్ కే.వేణుగోపాల్, జిల్లా సాధన సమితి అధ్యక్షుడు, ఉదయగిరి

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	137
స్కిన్ చికెన్	246
స్కిన్‌లెస్	270

కోడిగుడ్ల ధర (100): 575

అల్లూరు-కావలి మార్గంలో రాకపోకల క్రమబద్ధీకరణ

అల్లూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : వరదనీరు పోటెత్తి రామన్న చెరువు ప్రమాదకరంగా మారడంతో ప్రమాదాలు జరగకుండా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. అల్లూరు - కావలి రోడ్డుపై రాకపోకలను నిలువరించేందుకు రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేసిన కంపచెట్లను గురువారం తొలగించారు. దీంతో కావలికి వెళ్లేందుకు సున్నపుబట్టి, ఉడ్‌హౌస్‌పేట మీదుగా వెళ్లే పరిస్థితి నుండి నేరుగా ఈ రోడ్డుపై రాకపోకలు కొనసాగించవచ్చని అధికారులు తెలిపారు.


కంపను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

భక్తిశ్రద్ధలతో కోటి సోమవారం పూజలు


శివాలయంలో దీపారాధన పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కావలి (టౌన్) అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం కోటి సోమవారం పర్వదినం సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పాతూరు, వెంగళరావునగర్, ముసునూరు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామునుంచి భక్తులు అధికసంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. దీపాలు వెలిగించి, శివకేశవులను ఆరాధించారు. దీంతో ఆలయాలు కార్తీకశోభను సంతరించుకున్నాయి. కార్తీక మాసంలో కోటి సోమవారం విశేషమైందని, ఈరోజు వ్రతాలు చేస్తే కోరిన కోరికలు సిద్ధిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు
పెదపవని హైస్కూల్ విద్యార్థుల ఎంపిక

లింగసముద్రం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదపవని హైస్కూల్‌కు చెందిన బాల బాలికలు రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల ఒంగోలులో జరిగిన జిల్లా స్థాయి ఫుట్‌బాల్ స్కూల్ గేమ్స్ సెలెక్షన్స్‌లో అండర్-14 బాలుర విభాగంలో నిశిపాల్, బాలికల విభాగంలో కె పూజిత, కె మహాలక్ష్మి, సీహెచ్ వర్షిణి, డి అనేష, బి శ్రీవ్య, బి హారిక, స్టాండ్ గర్ల్‌గా డి లిఖిత ఎంపికయ్యారు. అలాగే అండర్-17 విభాగంలో ఒ అర్చన, బి చాందిని ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు టి శ్రీనివాస్, పిడి వెంకటక్రిష్ణ తెలియజేశారు. నవంబరు 28, 30 తేదీలలో నరసారావుపేటలో జరిగే అండర్-17 విభాగానికి చెందిన బాలికలు, అదేవిధంగా అండర్-14 విభాగానికి చెందిన బాల బాలికలు చిత్తూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. కాగా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన బాల బాలికలను హెచ్‌ఎం శ్రీనివాస్, పిడి వెంకటక్రిష్ణ, ఉపాధ్యాయులు, పిఎంసీ కమిటీ సభ్యులు, గ్రామస్థులు అభినందించారు.


ఎంపికైన బాలబాలికలను అభినందిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసులు

వానలతో చెరువులకు జలకళ

లింగసముద్రం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావంతో మండలంలో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని సాగు చెరువులకు పూర్తి సామర్థ్యంతో నీరు చేరి జలకళను సంతరించుకున్నాయి. ఈ వర్షాలకు మండలంలోని మొగిలిచెర్ల, లింగసముద్రం కొత్త, పాత చెరువులు, విశ్వనాథపురం, వీఆర్ కోట, చినపవని, పెదపవని, మేదరమెట్లపాలెం చెరువులు పూర్తి సామర్థ్యంతో నిండాయి. ఏళ్ల తరబడి పూర్తి సామర్థ్యంతో నిండని పెదపవని, లింగసముద్రం కొత్త, పాత చెరువులు నిండడంతో ఆయా ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే లింగసముద్రం పాత చెరువు అలుగు పారుతోంది. చెరువులు నిండడంతో రైతులు వరిసాగు చేస్తామని చెప్పారు. కొన్ని చెరువుల కింద ఆరేళ్ల తర్వాత వరి పైరు సాగు చేయనున్నట్టు రైతులు పేర్కొన్నారు.


పూర్తి సామర్థ్యంతో లింగసముద్రం పాత చెరువు

మురుగు కాలువలు లేక ఇక్కట్లు

వలేటివారిపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకభూపాలపురంలో మురుగు కాలువలు లేకపోవడంతో ఇళ్లలోని వృథా నీరు, వర్షం నీరంతా సిమెంటురోడ్లపైనే నిలుస్తోంది. దీంతో ఆ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరుకు వర్షం నీరు తోడవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. వ్యాధులు ప్రబలుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. అంతేగాకుండా ఆ మురుగు నీటిలోనే నడవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ పాలకులు, అధికారులు స్పందించి డ్రైనేజీలు నిర్మించి మురుగునీరు, వర్షం నీరు రహదారులపై నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.


అంకభూపాలపురంలో మురుగు కాలువలు లేక సిమెంటు రోడ్డుపైనే నిలిచిన వర్షపు నీరు

వరదకు దెబ్బతిన్న ఉప్పుటేరు వంతెన

● గ్రావెల్ వేసిన కూటమి నేతలు

లింగసముద్రం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలకు వచ్చిన భారీ వరద నీటికి మండలంలోని పెదపవని గ్రామ సమీపంలోని ఉప్పుటేరు వంతెన దెబ్బతింది. దీంతో మంగళవారం రాత్రి నుండి ఈ వంతెనపై రాకపోకలు నిలిచి పోయాయి. అయితే గురువారం వంతెనపై వరద నీటి ప్రవాహం తగ్గడంతో గ్రామానికి చెందిన కూటమి నేతలు గ్రావెల్ తోలి చదును చేశారు. దీంతో ఉదయం 10 గంటల నుండి వంతెనపై బస్సులు ఇతర వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి. ఈ పనులను తహసీల్దార్ కె కోటేశ్వరరావు, వీఆర్ బ్రహ్మయ్యలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు రఫీ,మధు, జనసేన నేత మనోహర్ పాల్గొన్నారు.


పెదపవనిలో వరదలకు శ్లాబు దిమ్మెలు లేచి పోయిన ఉప్పుటేరు వంతెన

నీరు నిలిచిన ప్రాంతాల్లో పారిశుధ్య పనులు

కందుకూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు కందుకూరు పట్టణంలోని పలు కాలనీలలో నివాసాల మధ్య వర్షపునీరు నిలిచిపోగా గురువారం మున్సిపాలిటీ సిబ్బంది ఆయా ప్రాంతాలలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ఎన్టీఆర్ నగర్, కేసరిగుంట కాలనీ, ఫైర్ ఆఫీసు ఏరియా, బూడిదపాలెం, గోకరాజుపాలెం, భన్వర్‌లాల్ నగర్,వెంకటేశ్వరరావు నగర్, గుణ్ణం కట్ట దిగువ ఏరియా, కృష్ణబలిజసంఘం, 4వ వార్డులోని ప్రాంతాలలో బ్లీచింగ్ చల్లారు. నిల్వనీటిలో ఆయిల్ బాల్స్ వేశారు. దోమల నివారణ చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.


నిల్వ నీటిలో ఆయిల్‌బాల్స్ వదులుతున్న పారిశుధ్య సిబ్బంది

నేడు రక్తదాన శిబిరం

కందుకూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం కందుకూరు సబ్‌డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు టౌన్ సీఐ అన్వర్‌బాషా ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పోలీసుస్టేషన్ ఆవరణలో నిర్వహించే ఈ రక్తదాన శిబిరంలో యువతీ యువకులు, విద్యార్థినీ విద్యార్థులతో పాటు అన్నివర్గాల ప్రజలు పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

తుఫాన్ బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ


ఉలవపాడు : తుఫాన్ బాధితులకు నిత్యావసర సరుకులు అందచేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి, సబ్‌కలెక్టర్ హిమవంశీ


కలిగిరి : బాధితులకు చెక్కును అందచేస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు

ఉలవపాడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బియ్యం, నిత్యావసర సరుకులు గురువారం సాయంత్రం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, కందుకూరు సబ్‌కలెక్టర్ దామెర హిమవంశీలతో కలిసి పంపిణీచేశారు. ఉలవపాడులోని 1వ నెంబరు రేషన్ షాపు వద్ద పునరావాస కేంద్రాలలో తలదాచుకున్న 45 కుటుంబాలకు 25 కిలోల బియ్యం బస్తా, కందిపప్పు, చక్కెర, చింతపండు, నూనె, ఉల్లిపాయలు వంటి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, యువనేత మంత్రి నారా లోకేష్‌లు తుఫాన్ మూడురోజులు అధికార యంత్రాంగాన్ని, ప్రజాప్రతినిధులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ఆస్తి, ప్రాణం నష్టం జరగకుండా తుఫాన్ బాధితులకు అండగా నిలిచారని కొనియాడారు. ఏళ్ల తరబడి వర్షాలకు నీట మునిగే కాలనీల ప్రజలకు శాశ్వత ఇళ్ల పట్టాలు, పక్కా ఇళ్లు నిర్మించేలా తన వంతు కృషి చేస్తానని, ఇదే విషయం సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. మండలంలో ఆరు తుఫాన్ పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసి 530 కుటుంబాలకు ఆశ్రయం కల్పించారని, వారందరికీ ప్రభుత్వం ప్రకటించిన బియ్యం, నిత్యావసర సరుకులు అధికారులు అందచేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ టీ శ్రీనివాసులు, మండల టీడీపీ అధ్యక్షుడు రాచగల్లు సుబ్బారావు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● నిత్యావసర సరుకుల పంపిణీ

కందుకూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వరద బాధితులకు రాష్ట్రప్రభుత్వం మంజూరుచేసిన బియ్యం, నిత్యావసర సరుకులను గురువారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సబ్ కలెక్టరు దామెర హిమవంశీతో కలిసి పంపిణీచేశారు. మొంథా తుఫాన్ ప్రభావంతో పునరావాస కేంద్రాలలో తలదాచుకున్న బాధితులకు ప్రతి కుటుంబానికి 25 కిలోల బియ్యం, ఐదురకాల నిత్యావసర సరుకులను 3వ నెంబరు రేషన్‌షాపు వద్ద అంద జేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందుచూపుతో చేపట్టిన చర్యల ఫలితంగా భారీ తుఫాన్ విరుచుకుపడినా ప్రాణనష్టం, భారీగా ఆస్తినష్టం జరగకుండా నివారించగలిగారని తెలిపారు. తుఫాను బాధితులను ఆదుకోవడంలో అధికారులతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు చూపిన చొరవ అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లావణ్య, మున్సిపల్ కమిషనర్ అనూష, ప్రకాశం జిల్లా డెయిరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. మొంథా తుఫాన్ కారణంగా ఇళ్లలోకి నీరుచేరి పనులకు వెళ్లలేని స్థితిలో ఉన్న పలు కుటుంబాల వారికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు స్నేహితులు గురువారం కూరగాయలు పంపిణీ చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం బియ్యం, నిత్యావసరాలు అందజేయటంతో ఎమ్మెల్యే సూచనతో తాము కూరగాయలు పంపిణీచేశామని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, ఉన్నం కొండలరావు, బెజవాడ ప్రసాదు, ఉన్నం వీరాస్వామి, ముచ్చుశ్రీను, కొత్తపల్లి సురేష్, మురారిశెట్టి సుధీర్‌కుమార్, చక్కా వెంకట కేశవరావు, కోట కిషోర్, కాకుమాని ప్రవీణ్, కోరుకొండ అంజిబాబు, చలంచర్ల రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

● పశువుల దాణా పంపిణీ

ఉలవపాడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో పశుగ్రాసం కొరత నివారణ చర్యల్లో భాగంగా పశుపోషకులకు గురువారం స్థానిక పశుసంవర్ధక శాఖ ఏడీ కార్యాలయంలో పశువుల దాణా పంపిణీ చేశారు. 50 శాతం సబ్సిడీతో మండలంలో 470 దాణా బస్తాలను పంపిణీ చేసినట్లు జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కే రమేష్‌నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం వలన వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేయాలని, అవసరమైన మందులు పంపిణీ చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ జీ శ్రీధర్‌రావు, ఉలవపాడు సహాయ సంచాలకులు డాక్టర్ జీ సురేష్ నాయుడు, పశు వైద్యాధికారులు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ ఎస్‌కే నజ్మా, అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొల్లినేని ఆర్థిక సాయం

కలిగిరి, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): ఇటీవల బోర్‌వెల్ లారీ ప్రమాదంలో తల్లిదండ్రులతో పాటు సోదరిని కోల్పోయిన చవలమూడి మేఘన కుటుంబ సభ్యులను తూర్పుదూబగుంటలో గురువారం మాజీ ఎమ్మెల్యేలు బొల్లినేని వెంకటరామారావు, మేకపాటి చంద్రశేఖరరెడ్డిలు పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే బొల్లినేని మాట్లాడుతూ ఈ ప్రమాదం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. గాయపడిన చిన్నారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. వైద్యానికి తనవంతు సాయంగా రూ. 50 వేలు అందించామన్నారు. కార్యక్రమంలో కొప్పర్తి హజరత్‌రెడ్డి, చి రుకూరుపాటి శివరామాచారి, కడప చినమాల్యాద్రి, స్వర్ణ కొండయ్య పాల్గొన్నారు.

పోకూరులో పారిశుధ్య పనులు

వలేటివారిపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోకూరులో గురువారం పారిశుధ్య సిబ్బంది వీధుల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. తుఫాన్ ప్రభావంతో వారం రోజులుగా కురిసిన వర్షాలకు పోకూరులో పారిశుధ్యం పడకేసింది. దీంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీడీఓ శంకర్‌రావు పంచాయతీ పాలకులు, అధికారులను ఆదేశించారు. దీంతో పంచాయతీ అధికారులు పారిశుధ్య సిబ్బందిచే వీధుల్లో బ్లీచింగ్ చల్లించారు. అనంతరం వాటర్‌ట్యాంక్‌ను క్లోరినేషన్ చేయించారు. అనంతరం సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్‌రావు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే ఇంటూరి

వలేటివారిపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండలో గురువారం తెలుగుదేశం పార్టీ నాయకుడు కామినేని రఘు కుమారుడు మాల్యాద్రి, అంజలి వివాహ వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, మాలకొండ దేవస్థానం మాజీ చైర్మన్ చెరువుపల్లి మాల్యాద్రి, కామినేని శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

దళిత, గిరిజనులను ఆదుకోవాలి : మల్లి

బిట్రగుంట. అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ వల్ల జీవనోపాధి కోల్పోయిన దళిత, గిరిజనులను ప్రభుత్వం ఆదుకోవాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి డిమాండ్ చేశారు. బోగోలు తహసీల్దారు కార్యాలయం ఎదుట కోవూరుపల్లి పంచాయతీ అంబేడ్కర్ నగర్‌కు చెందిన దళితులతో కలిసి గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. తుఫాన్ బాధితులకు నగదు, సరుకులు ఇంతవరకు పంపిణీ చేయలేదన్నారు. కోవూరుపల్లిలో రియల్ ఎస్టేట్ వ్యాపారి చుట్టూ గోడ నిర్మించడంతో వర్షపు నీరు గ్రామంలో నిలిచిపోయి, స్థానికులు అవస్థలు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దళిత, గిరిజన నేతలు బాపట్ల సత్యవతమ్మ, పొట్లూరి కీర్తి, ఆత్మకూరు మోహన్‌రావు, ప్రసాద్, జడ్డా వాసు, తేజ తదితరులు పాల్గొన్నారు.

విరాళం

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): గ్రామదేవత అంకమ్మ ఆలయ అనివేటి మండపం నిర్మాణం కోసం పట్టణానికి చెందిన తుమ్మపూడి సుబ్బయ్య, విజయలక్ష్మి దంపతులు వారి కుమారుడు రాఘవ, పావని దంపతులు రూ. 25101 విరాళంగా అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులకు ఈ మొత్తాన్ని అందజేశారు.

పారదర్శకంగా పని చేయాలి

కావలి, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): నిబంధనలను తప్పక పాటిస్తూ పురపాలనలో ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా పారదర్శకంగా పని చేయాలని జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పేర్కొన్నారు. 'విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ 2025'లో భాగంగా గురువారం కావలి పురపాలక సంఘ సమావేశ మందిరంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీహరిరావు, తహసీల్దార్ శ్రీక్రిష్ణప్రసాద్, ఏఈ వెంకటరెడ్డి మాట్లాడారు. పురపాలక సంఘాలలో ఆస్తి పన్ను విధింపు, భవన నిర్మాణ పనుల అనుమతులు, అక్రమ నిర్మాణాలు, అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణలో ప్రభుత్వ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. డీఅండ్‌వో ట్రేడ్ లైసెన్స్ ఫీజులు, ప్రకటన పన్నుల విధింపు సక్రమ వసూళ్ల ద్వారా ఎక్కువ మొత్తంలో ఆదాయ వనరులను సమకూర్చటంలో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అనంతరం సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జీ శ్రావణ్‌కుమార్, మేనేజరు పీ. ఫణికుమార్, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారులు

రోడ్లు, డ్రైన్ల నిర్మాణం చేపట్టాలని ధర్నా

కావలి, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రోడ్లు, డ్రైన్లు అధ్వానంగా ఉన్నాయని, వెంటనే వాటి నిర్మాణాలు చేపట్టాలని సీపీఎం నేతలు గురువారం కావలి మున్సిపల్ కార్యాలయంవద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి పీ. పెంచలయ్య మాట్లాడుతూ పట్టణంలో డ్రైన్లు సక్రమంగా లేనందున వర్షాలకు కాలనీలు నీట మునుగుతున్నాయన్నారు. దీంతో ప్రజలు అవస్థలకు గురవుతున్నారని చెప్పారు. పట్టణంలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. అధికారులు స్పందించి రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు పీ. తిరుపాలు, వై క్రిష్ణమోహన్, బీ క్రిష్ణయ్య, జీ మధుసూధనరావు, మేడా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

తుఫాన్‌తో దెబ్బతిన్న రహదారులు

కందుకూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీవర్షాలతో కందుకూరు నియోజకవర్గంలోని అనేక రహదారులు దెబ్బతిన్నాయి. ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షంతో అనేక రోడ్లు మోకాటిలోతు గుంతలతో దర్శనమిస్తున్నాయి. మాచవరం నుంచి పరకొండపాడు వెళ్లే రహదారి, కందుకూరు నుంచి కొష్టాలకు వెళ్లే రోడ్డు, విక్కిరాలపేట రోడ్డు నుంచి పలుకూరుకు వెళ్లే రోడ్డు, అనంతసాగరం రోడ్డు దెబ్బతిన్నాయి. అలాగే విక్కిరాలపేట-నరిశెట్టివారిపాలెం రోడ్డు, కందుకూరు నుంచి ఆనందపురం, దొండపాడు మీదుగా మాచవరం వెళ్లే రోడ్డు, వలేటివారిపాలెం - లింగసముద్రం, లింగసముద్రం - మొగిలిచర్ల, చీమలపెంట రోడ్డు, కేపీఎస్‌ఎం రోడ్డు దెబ్బతినడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. గ్రామీణ లింకురోడ్లు, గ్రావెల్ రోడ్లు మరీ అధ్వానంగా ఉన్నాయని, దెబ్బతిన్న రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేయించి పరిస్థితిని చక్కదిద్దాలని ప్రజలు వాహనదారులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.


మాచవరం నుంచి పరకొండపాడుకు వెళ్లే రోడ్డు దుస్థితి


పోకూరు - చీమలపెంట రోడ్డు దుస్థితి

ఆధార్ ప్రత్యేక క్యాంపు


ఆధార్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఆదినారాయణరావు, ఎంఈవో-1 రవికుమార్

కొండాపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాయిపేట దామా చినబాబు మెమోరియల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆధార్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీవో ఆదినారాయణరావు, ఎంఈవో-1 రవికుమార్‌లు పరిశీలించారు. పలు పాఠశాలల నుండి 19 మంది విద్యార్థుల వేలిముద్రలు అప్‌డేషన్‌తోపాటు నలుగురు చిన్నారుల నూతన ఆధార్‌కార్డుల కోసం క్యాంపు నిర్వహించామన్నారు. చిన్నారులకు నూతన ఆధార్ కార్డు పొందాలంటే తప్పనిసరిగా పుట్టిన తేదీ సర్టిఫికెటు ఉండాలని వారు తెలిపారు. శుక్రవారం తూర్పుఎర్రబల్లి కాంప్లెక్స్ పరిధిలో ఆధార్ బయోమెట్రిక్ ప్రత్యేక క్యాంపు జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఐ రామమోహన్ పాల్గొన్నారు.

తెగిపోయిన రహదారికి మరమ్మతులు


మరమ్మతులు చేయిస్తున్న టీడీపీ నాయకుడు కిలారి నరేంద్ర

కొండాపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గానుగపెంట పంచాయతీ పరిధిలో ఆదిమూర్తిపురం నుండి గానుగపెంటకు వెళ్లే రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బ తింది. ఉప్పుటేరుకు సమీపంలో సుమారు 30 మీటర్ల దూరం కొట్టుకుపోయింది. ఆదిమూర్తిపురం వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో మండల టీడీపీ కో ఆర్డినేటర్ పోలినేని చంద్రబాబునాయుడు సమస్యను ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడారు. రోడ్డు నిర్మాణానికి టెండరు పూర్తయిందని అధికారులు చెప్పగా, ప్రయాణానికి వీలుగా మరమ్మతులు చేయించాలని చంద్రబాబుకు సూచించారు. దీంతో గానుగపెంట టీడీపీ నాయకుడు కిలారి నరేంద్రతో కలసి మరమ్మతులు చేయించారు.

వంద అడుగుల రోడ్డు సర్వే


సర్వే చేస్తున్న తహసీల్దార్ తదితరులు

కలిగిరి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కావలి-చుత్తలూరు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కలిగిరిలో గురువారం తహసీల్దార్ గిరీష్‌కుమార్ సర్వే చేపట్టారు. వీఆర్వో, సర్వేయర్లతో కలసి రోడ్డు విస్తరణకు మార్కింగ్ వేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల కోరిక మేరకు పట్టణంలో రోడ్డుకు మధ్యనుండి ఒక వైపు 50 అడుగులమేర కట్టడాలు, దుకాణాలు తొలగించడానికి మార్కింగ్ వేశామన్నారు. రోడ్డు విస్తరణలో 50 అడుగుల మేర తొలగిస్తే తాము దుకాణాలు, ఇళ్లు పూర్తిగా కోల్పోతామని, తమకు కొంత సడలింపు ఇవ్వాలని స్థానికులు కోరగా, ఉన్నతాధికారులకు తెలియచేస్తామని తహసీల్దార్ తెలిపారు.

జూదరుల అరెస్టు

కందుకూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటారెడ్డి నగర్‌లో ఓ ఇంటిలో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారంతో గురువారం రాత్రి దాడిచేసి ఐదుగురు జూదరులను అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ శివనాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. వారి వద్ద రూ. 6130 నగదు స్వాధీనం చేసుకున్నట్లు, కోర్టులో హాజరుపరుస్తామని ఆయన తెలిపారు.



యోగాసనం

ఎముకలే లేనట్లుగా.. శరీరాన్ని ఎటు పడితే అటు మెలితిప్పుతూ విద్యార్థులు ప్రదర్శించిన యోగా విన్యాసాలు సభికులను ఆశ్చర్య పరిచాయి. తిరుపతిలో జరిగిన ఐక్యతా ర్యాలీ సమావేశంలో యోగాసనాలు వేశారు.

- 6లో

శ్రీవారికి పుష్పాభిషేకం

అలంకార ప్రియుడైన శ్రీవారికి తిరుమలలో గురువారం పుష్పాభిషేకం నిర్వహించారు. దాదాపు తొమ్మిది టన్నుల పూలతో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పకు పుష్పార్చన చేశారు.





పాకాల మండలం ఒడ్డిపల్లెలో వరిపైరులోకి చేరిన వర్షపునీరు

మూడు రోజులపాటు ప్రజలను అవస్థలకు గురిచేసింది. అధికార యంత్రాంగాన్ని పరుగులు పెట్టించింది. వాతావరణ శాఖ హెచ్చరించిన స్థాయిలో తుఫాన్ తీవ్రత లేకున్నా నష్టాన్ని మాత్రం ఓ మాదిరిగా మిగిల్చింది. ఇలా జిల్లాలో మొంథా వల్ల కలిగిన నష్టం రూ.38.21 కోట్లుగా ప్రాథమిక అంచనాకు వచ్చారు. క్షేత్రస్థాయిలో నష్టం వివరాలను పరిశీలించి, బాధితులను గుర్తించడంలో అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారు.



నారాయణవనం మండలం తుంబూరు వద్ద దెబ్బతిన్న కాజ్‌వే

ఆపద వీడింది నష్టం మిగిలింది

- తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి

- ప్రాథమిక నష్టం అంచనా రూ.38.21 కోట్లు
- వాస్తవానికి కావాల్సింది రూ.300 కోట్లకు పైనే
- వివరాల సేకరణలో పలుశాఖల జాప్యం

చేతికందిన పంట నేలమట్టం

తుఫాన్ వరి రైతులను వెన్ను విరిచింది. రేపో మాపో కోత కోసం పంటను అమ్ముకుని అప్పులు తీర్చుకుందామనే సమయంలో వరుస వర్షాలు, గాలుల ధాటికి చేతికి అందిన పంట నేలమట్టమైంది. అత్యధికంగా వరి 94 హెక్టార్లలో, వేరుశనగ 2 హెక్టార్లలో, కాకర, ఇతర ఉద్యానవన పంటలు 1.6హెక్టార్లలో దెబ్బతిన్నాయి.

విద్యుత్‌శాఖకు రూ.57లక్షల షాక్

బలమైన ఈదురుగాలులతో విద్యుత్‌శాఖకు రూ.57లక్షల నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా వేశారు. విద్యుత్ స్తంభాలను ఎప్పటికపుడు పునరుద్ధరించారు.తుఫాన్ ప్రభావిత సబ్‌స్టేషన్లు85, దెబ్బతిన్న స్తంభాలు 132, తెగిన విద్యుత్ తీగలు 4.55 కిలోమీటర్లు, పాడైన ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. విద్యుత్‌శాఖకు సుమారు 57.5లక్షలు నష్టం వాటిల్లింది.

నీటిపారుదలశాఖకు రూ.32 కోట్లు నష్టం

జిల్లాలో భారీ వర్షానికి సింహభాగం నీటిపారుదలశాఖకు వచ్చేసరికి రూ.32కోట్లు దెబ్బతిన్నాయి. జిల్లాలో చాలా చోట్ల చెరువులకు గండ్లు పడ్డాయి. కొన్నిచోట్ల గట్లు లీకయ్యాయి. ఇక మున్సిపల్‌శాఖకు రూ.18లక్షల మేర నష్టం వాటిల్లింది. ఓపెన్ డ్రైన్లు, ఈ తుఫాన్ వల్ల పశుసంవర్థకశాఖకు రూ.14లక్షల నష్టం జరిగింది. దాదాపు 78 మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. ఇక తుఫాన్‌ధాటికి 24 ఇళ్లు దెబ్బతినగా పాక్షికంగా 12 ఇళ్లు దెబ్బతిన్నాయి. 16 పూరిగుడిసెలు దెబ్బతినగా రూ.13లక్షల నష్టం వాటిల్లింది. జిల్లాలో 19మండలాల్లో తుఫాన్ ధాటికి నష్టం వాటిల్లింది.

ఎందుకంత ఆలస్యం?

తుఫాన్ నష్ట అంచనా వివరాలను సేకరించడంలో జాప్యం జరుగుతోంది. మంగళవారం నాటికే జిల్లాలో వర్షాలు నిలిచినా బుధ, గురువారాల్లోనూ తుఫాన్ నష్టం అంచనా పూర్తి కాలేదు. కలెక్టర్ వెంకటేశ్వర్ క్షేత్రస్థాయిలో తిరిగి తుఫాన్‌నష్ట వివరాలను త్వరగా పంపాలని ఆదేశించినా, వీడియో కాన్ఫరెన్సు పెట్టి పదే పదే తెలిపినా కొన్నిశాఖల్లో తుఫాన్ నష్టాన్ని అంచనా వేయడంలో జాప్యం చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. దాదాపు తుఫాన్ ప్రభావం పోయి రెండు రోజులైనా 50శాతం కూడా జిల్లా అధికారులు నివేదికలు సిద్ధం చేయకపోవడం గమనార్హం.

దెబ్బతిన్న రోడ్లు

సాధారణ రోజుల్లో రోడ్లు తరచూ మరమ్మతులకు గురవుతుంటాయి. తుఫాన్ నేపథ్యంలో సుమారు ఐదు రోజులు జిల్లాలో వర్షాలు పడటంతో సుమారు 267 కిలోమీటర్లు దెబ్బతిన్నాయి. జిల్లా మొతంగా 112 రోడ్లు దెబ్బతిన్నాయి. ఆర్‌అండ్‌బీ పరిధిలో 42 రోడ్లు.. సుమారు 129 కిలోమీటర్ల దెబ్బతింది. ఇక పంచాయతీరాజ్‌శాఖకు సంబంధించి 70 రోడ్లు.. 138 కిలోమీటర్ల వరకు మరమ్మతులకు గురైంది. రెండు శాఖలకు కలిపి సుమారు రూ.5 కోట్ల మేర నష్టం వాటిల్లింది.



కావాల్సింది రూ.300 కోట్లు పైమాటే

ప్రాథమికంగా తుఫాన్ నష్టాన్ని రూ.38.21 కోట్లుగా అంచనా వేసినా, వాస్తవానికి రూ.300 కోట్లకుపైనే కావాల్సి ఉంటుందని అధికార యంత్రాంగం చెబుతోంది. ఉదాహరణకు ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్‌లో కిలోమీటరు రోడ్డు వేయడానికి రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షలు అవసరం. ఈ లెక్కన రెండు శాఖలకు సంబంధించి తాత్కాలిక మరమ్మతులకు కావాల్సింది రూ.40 కోట్లకుపైనే. కానీ, ఎన్డీఆర్‌ఎఫ్ నిబంధనల ప్రకారం కిలోమీటరుకు రూ.60-70వేలు చూపుతుంది. దీంతో రూ.5 కోట్ల వరకు ప్రాథమికంగా అంచనా వేశారు. ఇక, జిల్లాలో దెబ్బతిన్న చెరువులకూ రూ.105 కోట్లు అవసరం. ఇలా అన్ని శాఖలు కలిపితే మరమ్మతులకు కావాల్సింది రూ.300 కోట్లు దాటుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. కాగా, కొన్ని శాఖల అధికారులు పూర్తిస్థాయి నష్ట వివరాలతో గురువారం రాత్రి కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ప్రజంటేషన్ ఇవ్వగా, ఇంకా పలు శాఖల నుంచి తీవ్ర జాప్యం జరుగుతోంది.

ఇసుక రీచ్‌లు, స్టాక్ యార్డుల గడువు పొడిగింపు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఇసుక రీచ్‌లు, యార్డుల అనుమతులు గడువు పొడిగిస్తూ జిల్లా స్థాయి ఇసుక కమిటీ చైర్మన్, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ సభ్యుల సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. నాగలాపురం మండలం కారణిలో సర్వే నెంబరు 162-2లో విష్ణువర్ధన రెడ్డి పట్టా భూమిలో అన్ని రకాల అనుమతులు ఉన్నందున అక్కడ్నుంచి 73,500 టన్నుల ఇసుక తవ్వుకునేందుకు అనుమతించారు. బైటకొడియంబేడులోని సర్వే నెంబరు 282-1,4లో 28,050 మెట్రిక్ టన్నులు, సూళ్లూరుపేట మండలం మంగానెల్లూరులో సర్వే నెంబరు 3-7బీ, 3-7బీ-2లోని 26,953 టన్నుల ఇసుకను తవ్వి తీసుకెళ్లడానికి అనుమతిచ్చారు. కారణిలోని సర్వే నెంబరు 159-1ఏ, 160-2, 3ఏ, 3బీ, 5బీలో ఇసుకను తవ్వి సరఫరాచేయడానికి.. సురుటుపల్లి ఆనకట్ట ఆరణి యార్ నదిలో ఎస్ఎస్‌బీ పేటలో 99,000 టన్నుల ఇసుక, పాలచ్చూరు ఆనకట్ట గుడాలివద్ద అనుమతులు ఆగస్టుకు ముగిసినందున ప్రస్తుతం నిల్వ ఉన్న ఇసుకను సరఫరా చేయడానికి వచ్చే ఏడాది మార్చి వరకు అనుమతి ఇచ్చారు. గూడూరులో, భాకరాపేటలో ఇసుక స్టాక్ యార్డుల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేశారు.

రాకెట్ ప్రయోగ రిహార్సల్ విజయవంతం

సూళ్లూరుపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): షార్ నుంచి నవంబరు 2న సాయంత్రం 5.26 గంటలకు ఎల్వీఎం3-ఎం5 రాకెట్ ప్రయోగం జరగనుంది. ఈ ప్రయోగానికి ముందు చేపట్టే ప్రయోగ రిహార్సల్‌ను గురువారం శాస్త్రవేత్తలు విజయవంతంగా నిర్వహించారు. రిహార్సల్‌లో భాగంగా రాకెట్‌ను మొబైల్ సర్వీసు టవర్ నుంచి వెనక్కి తీసుకొచ్చి మళ్లీ తీసుకెళ్లే కార్యక్రమాన్ని విజయవంగా చేపట్టారు. ప్రయోగానికి సంబంధించిన మిషన్ రెడీనెస్ రివ్యూ సమావేశం (ఎంఆర్ఆర్) శుక్రవారం షార్‌లో జరగనుంది. ఈ సమావేశంలో శాస్త్రవేత్తలు సమావేశమై చర్చించి ఏవైన లోటుపాట్లు ఉంటేసరిచేసి ప్రయోగానికి సంసిద్ధత ఇస్తారు. ఎంఆర్ఆర్ అనంతరం షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ అధ్యక్షతన లాంచింగ్ ఆథరైజేషన్ బోర్డు (ల్యాబ్) సమావేశమై ప్రయోగాన్ని అధికారికంగా ప్రకటించి గ్రీన్ సిగ్నల్ ఇస్తారు. ప్రయోగ ఏర్పాట్లు చివరి దశకు చేరుకోవడంతో షార్‌లో సందడి నెలకొంది.

పోక్సో కేసులో జీవిత ఖైదు

వెంకటగిరిటౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలోని సర్వేపల్లి అంజయ్యకు పోక్సో కేసులో జీవిత ఖైదు, రూ.40వేలు జరిమానా విధిస్తూ నెల్లూరు కోర్టు జడ్జి సిరిపిరెడ్డి తీర్పునిచ్చారని సీఐ ఏవీ రమణ గురువారం తెలిపారు. మహిళలు, చిన్నారులపై అత్యాచారాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సాక్ష్యాధారాలు సేకరించి ఈ కేసులో నేర నిరూపణ చేసినట్లు తెలిపారు.

ఈ-బస్సు.. ఏసీ సూపర్ లగ్జరీ!



రెట్రోఫిట్మెంట్ చేయనున్న సూపర్ లగ్జరీ బస్సు

- పాత బస్సు కన్వర్షన్‌కు ముందుకొచ్చిన పూణె కంపెనీ
- ఈ ప్రయోగం సఫలమైతే సూపర్ లగ్జరీలన్నీ ఎలక్ట్రిక్ బస్సులే

పాత సూపర్ లగ్జరీ బస్సులను ఏం చేయాలి? పర్యావరణ హితం.. సంస్థకు లాభదాయకంగా ఎలా మార్చాలి? 'ఎలక్ట్రిక్ ఏసీ సూపర్ లగ్జరీలు'గా కన్వర్షన్ చేయడమే దీనికి పరిష్కారంగా అధికారులు ఓ నిర్ణయానికొచ్చారు. ఈ ప్రయోగం విజయవంతమైతే తక్కువ ఖర్చుతో ఎలక్ట్రిక్ ఏసీ సూపర్ లగ్జరీ బస్సులు మరిన్ని రోడ్డెక్కనున్నాయి.

- తిరుపతి(ఆర్టీసీ), ఆంధ్రజ్యోతి

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఆర్టీసీపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎలక్ట్రిక్ బస్సుల ఏర్పాటులో జిల్లాకు తొలి ప్రాధాన్యమిచ్చే కార్యాచరణ వేగవంతమైంది. ఇప్పటికే చిత్తూరులో గ్యాస్‌తో బస్సు నడిచేలా ప్రయోగాత్మకంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. అలాగే కుప్పండిపో నుంచి ఓ బస్సును ఎలక్ట్రిక్ విధానంలోకి మార్చేందుకు బెంగళూరు సంస్థను సంప్రదించారు. తిరుపతికి సంబంధించి రెట్రోఫిట్మెంట్‌కు పూణెకు చెందిన కల్యాణి పవర్‌ట్రైన్ లిమిటెడ్ సంస్థ ముందుకు రాగా వారం కిందటే ఎంవోయూ కుదుర్చుకున్నారు. దీంతో పాటు ఆర్టీవో ద్వారా కన్వెన్షన్ అనుమతి పొందారు. దీని కోసం ప్రస్తుతం పల్లెవెలుగు పేరుతో నడుస్తున్న సూపర్‌లగ్జరీ అశోక్ లేల్యాండ్ బస్సు (ఏపీ 03 జెడ్ 5473)ను ఎంపిక చేశారు. దీనిని అతి త్వరలోనే విజయవాడలోని కల్యాణి పవర్‌ట్రైన్ లిమిటెడ్ యూనిట్‌కు తీసుకెళ్లి అప్పగిస్తారు. ఆ తర్వాత 180రోజుల్లో ఫిట్మెంట్, బాడీఫ్యాబ్రికేషన్, టెస్టుట్రయల్ నిర్వహిస్తారు. ఈ టెస్ట్‌రన్ రిపోర్టుతో పూణెలోని ఆ సంస్థ ఆమోదం పొందుతారు. ఆపై 60 రోజులపాటు విజయవాడ లేదా తిరుపతిలో క్షేత్రస్థాయిలో టెస్ట్‌రన్ చేస్తారు. అది విజయవంతమైతే ఆర్టీవో ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేసి డీజిల్ ఎల్లో బోర్డు నుంచి గ్రీన్ బోర్డుకు మారుస్తారు. ఆ తర్వాత ప్రయాణికుల ఆదరణ ఉన్న రెగ్యులర్ రూట్‌ను ఎంపికచేసి కొన్ని రోజుల పాటు నడపతారు. ఆ తర్వాత దీనిపై ఉన్నతాధికారులు సమీక్షించి ఇలా మార్చడంతో ప్రయోజనం ఉందనుకుంటే మిగతా పాత సూపర్ లగ్జరీ బస్సులను ఇదే ప్రక్రియలోకి తీసుకురానున్నారు.

మార్పులు.. చేర్పులిలా

- పాత బస్సులో ప్రస్తుతమున్న ఇంజన్, గేర్‌బాక్సు, రేడియేటర్, ఎగ్జాస్టర్‌సిస్టమ్, డీజిల్ ట్యాంకు తొలగిస్తారు. వాటి స్థానంలో బ్యాటరీలు, హెవీడ్యూటీ హెయిర్ కంప్రెషర్, బ్యాటరీ కూలింగ్ సిస్టమ్, పవర్ కన్వర్టర్లను అమరుస్తారు. చేసెస్ మినహా మిగిలిన అన్ని భాగాలు మారుస్తారు.
- 36సీట్ల సామర్థ్యంతో ఎలక్ట్రిక్ ఏసీ సూపర్ లగ్జరీ బస్సుగా మారుస్తారు.
- రూ.100 ఇంధనంతో ఐదు కిలోమీటర్లు నడిచే బస్సు, రెట్రోఫిట్మెంట్ ద్వారా రూ.50 విద్యుత్, ఇతర ఖర్చులతో ఐదు కిలోమీటర్లకుపైగా నడుస్తుంది.
- ఆర్టీసీకి సగం ఖర్చుల భారం తగ్గుతుంది.
- ఎలక్ట్రిక్ బస్సు కావడం వల్ల కాలుష్యం, శబ్దం లేకుండా పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుంది.
- బ్యాటరీ చార్జింగ్ పూర్తయితే 140 నుంచి 150 కిలోమీటర్లు ఏసీతో ప్రయాణిస్తుంది.



నమూనా 'ఎలక్ట్రిక్ ఏసీ సూపర్ లగ్జరీ' బస్సు



ముంపు ప్రాంత ప్రజలకు ఆలు, ఎర్రగడ్డలు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో పునరావాస కేంద్రాల నుంచి ఇళ్లకు వెళ్లే వరద బాధితులకు పంపిణీ చేయడానికి ఆలుగడ్డలు, ఎర్రగడ్డలను సిద్ధం చేస్తున్నారు. కిలో చొప్పున ప్యాకింగ్ చేస్తున్నారు. తిరుచానూరు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ మౌనిక, కార్యదర్శి జానకిరామ్, పాలకవర్గంతో పాటు అధికారులు గురువారం 8 టన్నుల ఉల్లిపాయలు, ఆలుగడ్డలను ప్యాకింగ్ చేసి తీర ప్రాంత మండలాలకు పంపారు.

ర్యాపిడ్ కిట్లు వచ్చేశాయ్

- రేషన్ బియ్యం అక్రమ రవాణాకు చెక్ పెట్టే అవకాశం



తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పేదలకు చెందాల్సిన ఉచిత రేషన్ బియ్యాన్ని కొందరు పక్కదారి పట్టిస్తున్నారు.పాలిష్ చేసి మార్కెట్లో అత్యధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీనికి చెక్‌పెట్టే దిశగా ప్రభుత్వం అత్యాధునిక విధానానికి శ్రీకారం చుట్టింది. రేషన్ బియ్యం అక్రమ రవాణాను శీఘ్రమైనంత త్వరగా కట్టడిచేసేలా చర్యలు చేపట్టింది. తిరుపతి సహా పలు ప్రాంతల్లో నగరంలో రెండు నెలలకు ఒకసారి కొందరు మహిళలు వచ్చి కిలో రూ.10 నుంచి రూ 12 వంతున రేషన్ బియ్యం కొంటున్నారు. వీటిని మిల్లర్లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా లక్షలాది రూపాయల పేదల బియ్యం మిల్లర్లకు చేరి పాలిష్డ్‌గా మారి.. మార్కెట్లోకి వస్తున్నాయి. అక్రమ రవాణాపై గతంలో అధికారులు తనిఖీ చేసినా.. ఆ బియ్యం రేషన్ షాపువేనని అనుమానిస్తే వాటిని ల్యాబ్‌కు పంపేవారు. పరీక్షలు చేశాకే రేషన్ బియ్యంపై నిర్ధారణకు వచ్చేవారు. ఆ తర్వాత చర్యలు తీసుకునేవారు. ఈ ప్రక్రియ ఆలస్యమయ్యేది. మరిప్పుడు వెంటనే రేషన్ బియ్యాన్ని గుర్తించేలా జిల్లాకు 30 రాపిడ్ కిట్లు పంపింది. వీటిని తిరుపతి నగరం, రూరల్, శ్రీకాళహస్తి, చంద్రగిరి, నాయుడుపేట ప్రాంతాలకు కేటాయించారు. ఈ కిట్లలో పొటాషియం థయో సైనైడ్, హైడ్రో క్లోరిక్ యాసిడ్ ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పోర్టిఫైడ్ రైస్ అయితే.. ఈ ద్రావణాలను ఆ బియ్యంపై చల్లిన వెంటనే ఎరుపు రంగుకు మారతాయి. బయట దుకాణాల్లో విక్రయించే బియ్యమైతే రంగు మారవు. ఆ వెంటనే బియ్యాన్ని సీజ్ చేయడానికి వీలవుతుంది. ఎక్కడైనా అనుమానాలుంటే ఈ కిట్లతో పరీక్షిస్తే అది రేషన్ బియ్యమా కాదా అనేది క్షణాల్లో తేలిపోతుంది. ఇలా అక్రమ రవాణాకు చెక్ పెట్టేదిశగా ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకుంది.

ఆర్టీసీలో ఆనందమానందమాయె

- 705మంది ఉద్యోగులకు పదోన్నతి

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఆరేళ్లుగా ఎదురు చూస్తున్న ఆర్టీసీ ఉద్యోగుల కలనెరవేరనుంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 705 మందికి పదోన్నతి లభించింది. పదోన్నతులు పొందిన వారి జాబితా శుక్ర లేదా శనివారాల్లో డీపీటీవో జగదీష్ ప్రకటించనున్నారు. 281 మంది గ్రేడ్-1 డ్రైవర్లుగా,130మంది గ్రేడ్-1 కండక్టర్లుగా,111మంది ఏడీసీ టెక్నికల్ కంట్రోలర్‌గా,46మంది డీసీలుగా,28మంది ఎల్‌హెచ్‌లుగా,45మంది గ్రేడ్ 1 మెకానికల్‌గా,6 మంది గ్రేడ్ 1టిమ్మర్లుగా,8మంది గ్రేడ్ 1పెయింటర్లుగా,4మంది గ్రేడ్ 1 వెల్డర్లుగా,6మంది గ్రేడ్ 1బ్లాక్‌స్మిత్‌గా,8మంది హమ్మర్‌మెన్స్‌గా.32మంది డిప్యూటీ మెకానికల్స్‌గా పదోన్నతి పొందినట్లు సమాచారం. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 15 డిపోల్లో దాదాపు 6వేలమంది పనిచేస్తున్నారు. వీరిలో ఒకేసారి 705మందికి పదోన్నతి లభించడంపై ఉద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది. గత వైసీపీ ప్రభుత్వ విధానాలతో దాదాపు వంద మంది పదోన్నతి పొందకుండానే రిటైరయ్యారని ఈ సందర్భంగా ఉద్యోగులు గుర్తు చేసుకుంటున్నారు. ప్రమోషన్ పొందిన వారికి మరోచోట పోస్టింగ్ ఇచ్చే అవకాశముంది. దీంతో కొన్ని ఖాళీలు ఏర్పడతాయని ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి.

ముందుచూపుతోనే తక్కువ నష్టంతో బయటపడ్డాం

● ఎంపీ సీఎం రమేష్


బీటెక్ రవి, సీఎం రమేష్

తిరుమల, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముందుచూపుతో మొంథా తుఫాను నుంచి చాలా తక్కువ నష్టంతో బయటపడ్డామని ఎంపీ సీఎం రమేష్ అన్నారు. మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, కుటుంబ సభ్యులతో కలిసి ఆయన గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఎక్కడికక్కడ అధికారులను అప్రమత్తం చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారన్నారు. అంతకు ముందు ఆయన శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

'అఖండ 2' మ్యూజిక్ కొంత పూర్తయింది



● డ్రమ్స్ శివమణి

తిరుమల, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): నందమూరి బాలకృష్ణ 'అఖండ2' సినిమాకు సంబంధించి బ్యాగ్రౌండ్ మ్యూజిక్ కొంతమేరకు పూర్తయిందని డ్రమ్స్ కళాకారుడు శివమణి తెలిపారు. గురువారం శ్రీవారిని దర్శించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఈ సినిమాలో తనకు అవకాశం కల్పించిన సంగీత దర్శకుడు తమన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తిరుమలలో మంచి దర్శనాలు చేయిస్తున్న సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలన్నారు.


సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 22 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.4 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 64,048

తలనీలాలు సమర్పించినవారు: 19,838





కదిలొచ్చిన పూలవనం

తొమ్మిది టన్నుల పుష్పాలతో అభిషేకం

చామంతి, సంపంగి, రోజాలు, గన్నేరు, మల్లె, మొల్లలు, కనకాంబరం, తామర, మాను సంపంగి, కలువ, మనోరంజితం, పారిజాతం, వృక్షి, సెంటుజాజి, మొగలి రేకులు, నిత్య మల్లె.. ఇలా 16 రకాల పూలు, ఐదు రకాల పత్రాలు.. శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీనివాసుడి సేవలో తరించాయి. పుష్పయాగం సందర్భంగా గురువారం తిరుమల ఆలయంలో ఉత్సవమూర్తుల హృదయాల దాకా పూలు నిండిపోయాయి. ఉదయమే ఆలయానికి పూలబుట్టలు బారులు తీరాయి. పుష్పవనమే తరలి వస్తున్నట్టుగా ఆ దృశ్యం కనిపించింది. తమిళనాడు నుంచి ఐదు టన్నులు, కర్ణాటక నుంచి రెండు టన్నులు, ఏపీ నుంచి రెండు టన్నుల చొప్పున మొత్తం 9 టన్నుల పూలను పుష్పాభిషేకం కోసం తెప్పించారు. తులసి, మరువం, దవణం, బల్వం, పన్నీరు, కదిరిపచ్చలనూ పుష్పయాగంలో అర్చనకు వినియోగించారు. బ్రహ్మోత్సవాల సమయంలో తెలియక జరిగే దోషాల నివారణకు కార్తీకమాసంలో వచ్చే శ్రీవారి జన్మనక్షత్రమైన శ్రణానక్షత్రంలో పుష్పయాగాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అంతకుముందు స్నపన తిరుమంజనం జరిగింది. కాగా, ఈ పూలను దాతల ద్వారా సమకూర్చడంలో విశేష కృషి చేసిన గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులను ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం శాలువాతో సత్కరించారు.

-తిరుమల, ఆంధ్రజ్యోతి







ఏడేళ్లుగా పరిశ్రమల కోసం ఎదురు చూపులు



ఏపీఐఐసీ బోర్డు

● 80కి పైగా ఏర్పాటు చేస్తామన్న మంత్రి

● అమలుకు నోచుకోక నిరాశలో ప్రజలు

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలత్తూరు, కొత్తపాళెం, భవానీశంకరపురంతోపాటు తొట్టంబేడు మండలం రౌతు సూరమాల గ్రామాల ప్రజలు పరిశ్రమల కోసం ఎదురు చూస్తున్నారు.


ఏపీఐఐసీకి కేటాయించిన భూమి

2017లో ఈ నాలుగు గ్రామాల నుంచి ప్రభుత్వం ఏపీఐఐసీ ద్వారా 2095 ఎకరాల భూములను సేకరించింది. గత ప్రభుత్వంలో ఈ భూములకు సంబంధించిన భూపరిహారాన్ని రైతులకు చెల్లించింది. వివిధ కారణాలతో కొంత మందికి చెల్లించలేదు. ఈ భూములకు లింక్ రోడ్డు నిర్మాణాలు, నాయుడుపేట హైవేకు ఆరులేన్ల రోడ్డు ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. భూములు శరవేగంగా తీసుకున్న అధికారులు ఇప్పటి వరకు ఒక్క పరిశ్రమను కూడా తీసుకురాకపోవడంతో ప్రజలు నిరాశకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో పెద్ద ఎత్తున పరిశ్రమలు నెలకొల్పడంతో ఈ ప్రాంతంలో కూడా పరిశ్రమలు నెలకొల్పుతారన్న ఆశతో ఉన్నారు. గత సంవత్సరం ఆగస్టులో రాష్ట్ర పరిశ్రమల శాఖ కమిషనర్ యువరాజ్ ఏపీఐఐసీ భూములను సందర్శించి, త్వరితగతిన భూములను అభివృద్ధి చేసి పరిశ్రమలు స్థాపిస్తామని చెప్పారు. ఈ సంవత్సరం ఏప్రిల్‌లో సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఏపీఐఐసీ భూములను పరిశీలించారు. ఈ భూములను అభివృద్ధి చేసి, 80 పరిశ్రమల ఏర్పాటుకు కేటాయిస్తున్నామని, నెల రోజుల్లో శంకుస్థాపన చేస్తామన్నారు. భూముల్లో లింక్ రోడ్ల పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించి ఏడు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు పట్టించుకున్న వారు లేరని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఏపీఐఐసీ భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

తిరుమల తర్వాత కాణిపాకం రండి

● పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్



తిరుమల, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులందరూ కాణిపాక వినాయకస్వామి ఆలయాన్ని కూడా దర్శించాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ విజ్ఞప్తి చేశారు. తిరుమల శ్రీవారిని గురువారం దర్శించుకున్న ఆయన అనంతరం మీడియాతో మాట్లాడుతూ, కాణిపాకంలో వసతి సముదాయం, కల్యాణవేదికల నిర్మాణం కోసం రూ.25 కోట్లు కేటాయించిన టీటీడీ ఛైర్మన్, సభ్యులు, ఈవో, అదనపు ఈవోలకు ధన్యవాదాలు తెలిపారు.

శ్రీవారి సేవలో కేరళ హైకోర్టు న్యాయమూర్తి



తిరుమల, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణన్ నటరాజన్ గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం చేశారు.

సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష
దరఖాస్తుకు 9 వరకు గడువు

తిరుపతి(విద్య), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సైనిక్ స్కూల్ ప్రవేశాలకు నిర్వహించే జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షకు నవంబర్ 9వ తేదీ వరకు గడువు పొడిగించారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రం అధినేత డాక్టర్ ఎస్.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరానికి 6, 9 తరగతుల్లో ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష వచ్చే ఏడాది జనవరి 18వ తేదీన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వయసును బట్టి 4 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న బాలబాలికలకు ఈ పరీక్షకు అర్హత ఉంటుందని వెల్లడించారు. దరఖాస్తు విధానం, అర్హతలు, పరీక్ష విధానం గురించి పూర్తి వివరాలు తెలుసుకునేందుకు 86888 88802, 93999 76999లలో తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం సైనిక్ - నవోదయ పోటీ పరీక్షల శిక్షణా కేంద్రాన్ని సంప్రదించవచ్చని తెలిపారు.

ఇసుక తరలిస్తున్న టిప్పర్ సీజ్

రేణిగుంట అక్టోబర్ 30 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్ లారీని గాజులమండ్యం పోలీసులు సీజ్ చేశారు. ఎస్‌ఐ సుధాకర్ కథనం మేరకు.. గురు వారం ఉదయం స్వర్ణముఖి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్ లారీని తూకివాకం పెట్రోల్ బంకు వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అడ్డుకున్నారు. స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేశారు.

నూతన కమిటీతో వేదపారాయణదారుల నియామకాలు

తిరుమల, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): టీటీడీ వేదపారాయణదారుల పోస్టుల భర్తీకి నవంబరు 10వ తేదీన ఇంటర్వ్యూలు జరుగనున్నాయి. ఈమేరకు ముగ్గురు సభ్యులతో కూడిన నూతన కమిటీ ఈ ఇంటర్వ్యూలను నిర్వహించనుంది. దాదాపు 700 మంది వేదపారాయణదారుల పోస్టుల భర్తీకి గతంలో టీటీడీ అంగీకారం తెలిపిన నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్ర బ్రాహ్మణులకు నష్టం కలిగేలా, తమిళనాడువాసులకు లబ్ధిచేకూరేలా వ్యవహరించారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో ఈ ఇంటర్వ్యూలు జరగకుండా టీటీడీ బోర్డు, అధికారులు నిర్ణయం తీసుకోవడంతో గత నెలలో భర్తీ ప్రక్రియ నిలిచిపోయింది. పాత కమిటీలోని వారిని తొలగించిన టీటీడీ.. తాజాగా మరో ముగ్గురు సభ్యులను నియమించి పారదర్శకంగా ఇంటర్వ్యూలు నిర్వహించాలని ఆదేశించింది. ఇప్పటికే ఫైనల్ చేసిన దరఖాస్తుదారులకు కాల్‌లెటర్లు పంపారు. దరఖాస్తుల స్వీకరణ సమయంలోనే రాష్ట్ర బ్రాహ్మణులను తొలగించారని, గత అధికారులు ఎంపిక చేసిన తమిళనాడువాసుల దరఖాస్తులను స్వీకరించి నూతన కమిటీతో ఇంటర్వ్యూలు చేయించినా రాష్ట్ర బ్రాహ్మణులకు న్యాయం జరగదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై టీటీడీ అధికారికంగా ప్రకటన చేయాల్సి ఉంది.

పరిశోధనలు ప్రగతికి తోడ్పడాలి:కలెక్టర్

పాకాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): శాస్త్రవేత్తలు, రీసెర్చ్ స్కాలర్లు తమ పరిశోధనలతో దేశాభివృద్ధికి తోడ్పడాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సూచించారు. విజిలెన్స్ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆయన గురువారం గాదంకిలోని ఎన్‌ఏఆర్‌ఎల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శాస్త్రవేత్తలు పరిశోధనలకు అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. వాతావరణంపై ఇక్కడ జరుగుతున్న పరిశోదనలు అభినందనీయమన్నారు. పరిశోధనా ఫలితాలు వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగకరమన్నారు. మొంథా తుపానుకు సంబంధించి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకోవడానికి వాతావరణ పరిశోధన కేంద్రాలవల్లనే సాధ్యమైందని గుర్తు చేశారు. ఇలాంటి కీలక కార్యాలయ విధుల్లో అప్రమత్తత అవసరమన్నారు. ఆయన సంస్థలోని హై పెర్మార్మెన్స్ కంప్యూటింగ్ వ్యవస్థ, వాతావరణ పరిశోధన, రాడార్ విధానాలను ఆసక్తిగా పరిశీలించారు. ఎన్‌ఏఆర్‌ఎల్ డైరెక్టర్ డాక్టర్ అమిత్ కుమార్ పాత్రో, విజిలెన్స్ అధికారి రఘునాథ్, అవేర్‌నెస్ కమిటీ ఛైర్మెన్ డాక్టర్ చైతన్య జైన్ ఏవో మల్లిక మాధురి, రీసెర్చ్ స్కాలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


ఎన్‌ఏఆర్‌ఎల్ అధికారులు,శాస్త్రవేత్తలు. రీసెర్చి స్కాలర్లు,సిబ్బందితో కలెక్టర్

వైభవంగా అత్తి వరదరాజస్వామి విగ్రహ స్థాపన పూజలు




వరదరాజస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన - హోమపూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధగా కొలువైన వరదరాజస్వామి ఆలయంలో గురువారం అత్తివరదరాజస్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. అగ్ని ప్రతిష్ఠాపనం, కుంభారాధనం, మహాశాంతి పూజలు చేశారు. అనంతరం విగ్రహస్థాపన జరిగింది. అనంతరం స్వామివారికి పలు రకాల అభిషేకాలు నిర్వహించి, అలంకరించారు. ఆలయ ఆవరణంలో హోమపూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ కొట్టే సాయిప్రసాద్, ఆలయాధికారులు తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం అగ్నిప్రణయనం, కుంభారాధనం, సర్పగాయత్రి హోమం జరగనుంది.

పటేల్ స్ఫూర్తితో దేశాభివృద్ధికి పాటుపడాలి

● ఐక్యతా ర్యాలీలో వక్తలు



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, బీజేపీ నేతలు తదితరులు



తిరుపతిలో సాగుతున్న ఐక్యతా ర్యాలీ

తిరుపతి(ఉపాధ్యాయనగర్), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఉక్కు మనిషి సర్దార్ వల్లబాయ్ పటేల్ స్ఫూర్తిగా యువత దేశం కోసం, ఐక్యత కోసం పాటుపడాలని పలువురు వక్తలు యువతకు పిలుపునిచ్చారు. మాజీ ఉప ప్రధాని పటేల్ 150వ జయంతి సందర్భంగా తిరుపతిలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో ఐక్యతా ర్యాలీ నిర్వహించారు. బాలాజీ కాలనీ నుంచి కచ్చపి ఆడిటోరియం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎస్వీయూ, ఇతర ప్రైవేటు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కచ్చపి ఆడిటోరియంలో జరిగిన సభా కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ స్వాతంత్ర్య అనంతరం దేశం ముక్కలయ్యే పరిస్థితుల్లో పటేల్ దృఢ సంకల్పంతో 560 సంస్థానాలను ఒక్కటిగా చేసి భారతదేశంగా మలిచారని చెప్పారు. ఆయన ఆశయాలు, సంకల్పం మనందరికీ ఆచరణ కావాలని పిలుపునిచ్చారు. ఎస్వీయూ వీసీ ఆచార్య నరసింగారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు మాట్లాడుతూ పటేల్ ఆదర్శంగా ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. రాష్ట్రాలకు నిధుల పెంపు, నీతి ఆయోగ్, జీఎస్టీ తగ్గింపు తదితర విధానాలతో కేంద్ర ప్రభుత్వం దేశ సమగ్రతకు పాటుపడుతోందన్నారు. బీజేపీ రాష్ట్ర సంఘటనా మంత్రి మధుకర్ మాట్లాడుతూ పటేల్ జీవిత విశేషాలను, ప్రముఖ సంఘటనలను ఉదహరిస్తూ విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. ఈ సందర్భంగా విద్యార్థులు యోగాసనాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేత, టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్, ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని డీఎస్పీ గీతాకుమారి అన్నారు. గురువారం స్థానిక రెండో పట్టణ పరిధిలోని ఓ ప్రైవేటు క్లబ్‌లో పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న మరొకరికి ప్రాణదానం చేసినవారమవుతామన్నారు. యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలన్నారు. ప్రజల రక్షణకు, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్‌శాఖ అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో సీఐలు శేఖర్‌బాబు, శ్రీనివాస్, ఎస్‌ఐలు తిరుపతయ్య, సుబ్రమణ్యంరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలలో మెగా రక్తదాన శిబిరం


మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ చెంచుబాబు, తిరుమలనాయుడు, రక్తదాన శిబిరంలో డీఎస్పీ, సీఐ, పోలీసు సిబ్బంది

నాయుడుపేట టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రక్తదానంతో మరొకరికి ప్రాణదానం కలుగుతుందని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు అన్నారు. నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. పోలీసు సిబ్బందితోపాటు, టీడీపీ నాయకులు, మేనకూరు సెజ్‌లోని వివిధ కర్మాగారాల కార్మికులు దాదాపు 200 మంది రక్తదానం చేశారు. అర్బన్ సీఐ బాబి, ఎస్‌ఐ ఆదిలక్ష్మి, టీడీపీ నాయకులు పూనాటి తిరుమలనాయుడు, పోట్లపూడి రాజేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

● ఓజిలి: స్థానిక పోలీసు స్టేషను వద్ద ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓజిలిలో యువకులు, ఆటో యూనియన్, విద్యార్థులు, పోలీసులు కలసి 80 మంది వరకు రక్తదానం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు, ఓజిలి, పెళ్లకూరు, దొరవారిసత్రం ఎస్‌ఐలు శ్రీకాంత్, నాగరాజు, అజయ్ కుమార్‌తోపాటు పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ


అక్కసముద్రం భూముల్లో బాధితుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ


బాలాయపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని యాచవరం గ్రామానికి చెందిన వరికూటి అన్నపూర్ణ అనే మహిళ స్వాధీనంలో ఉన్న భూమిని వెంగమాంబపురం గ్రామానికి చెందిన సీసీ నాయుడు ఆక్రమిస్తుండగా అడ్డుకున్నందుకు తనపై దాడి చేసి కులం పేరుతో దూషించాడని బాధితురాలు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం గూడూరు డీఎస్పీ గీతాకుమారి అక్కసముద్రం రెవెన్యూ పరిధిలో వివాదాస్పదంగా మారిన భూమిని పరిశీలించి, అట్రాసిటీ కేసుపై విచారణ చేపట్టారు. డీఎస్పీ వెంట ఎస్‌ఐ గోపీ, వీఆర్వో పెంచలయ్య, సర్వేయర్ పూజిత ఉన్నారు.

తప్పుడు కేసులతో టార్గెట్ చేస్తున్నారు
● టీడీపీ సీనియర్ నేత సీసీ నాయుడు



వెంకటగిరి, అక్టోబర్ 30(ఆంధ్రజ్యోతి): తప్పుడు కేసులతో తనను టార్గెట్ చేస్తున్నారని టీడీపీ సీనియర్ నేత, బాలాయపల్లి మండలానికి చెందిన సీసీ నాయుడు ఆరోపించారు. భూఆక్రమణ, దళితులపై దాడి చేశారన్న ఆరోపణలతో బాలాయపల్లి పోలీసులు తనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసిన నేపథ్యంలో గురువారం స్థానిక తెలుగుగంగ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను టీడీపీ తరుపున ప్రజా సమస్యలపై పోరాడిన ప్రతిసారి కక్షతీర్చుకొనే చర్యలు ఎదుర్కొంటున్నానని అన్నారు. తనపై పెట్టిన కేసు వెనుక వైసీపీ నాయకులతోపాటు తమ పార్టీకి చెందిన కొంత మంది నేతల ప్రమేయం ఉందని ఆరోపించారు. భూఆక్రమణలపై స్పందించిన ఆయన సదరు భూమిపై తనకు హక్కు పట్టాలు ఉన్నాయన్నారు. తాను ఎవరి భూమినైనా ఆక్రమించినట్లు, దళితులను దూషించినట్లు రుజువు చేస్తే తాను జైలుకు వెళ్లేందుకు సిద్ధమేనన్నారు. 40 ఏళ్ల తన రాజకీయ జీవితంలో సొంత ఇల్లు కూడా కట్టుకోలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు.

యూరియా అందిస్తాం.. ఆందోళన వద్దు


యూరియా టోకెన్‌ను అందిస్తున్న ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, కేవీ నాయుడు

పెళ్లకూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతుకు సరిపడా యూరియా అందజేస్తామని, ఆందోళన చెందవద్దని జనసేన ఇన్‌చార్జి, నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ కుమార్ తెలిపారు. గురువారం చిల్లకూరు సొసైటీ గోడౌన్‌లోని యూరియా పంపిణీ కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ కొచ్చర్ల వెంకటరమణయ్య నాయుడితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతి రైతుకు తగినంత యూరియా సరఫరా చేసేలా చర్యలు తీసుకుందన్నారు. కేవీనాయుడు మాట్లాడుతూ చిల్లకూరు సొసైటీలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. యూరియాను పారదర్శకంగా పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. చిల్లకూరు సొసైటీ డైరెక్టర్ ఎద్దల రామకృష్ణారెడ్డి, సిబ్బంది నెలవల లోకేష్, కుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు కలిచేటి నరసింహులు, టీడీపీ నాయకులు అక్కరపల్లి మాధవ రెడ్డి, ఖైనా సుబ్రహ్మణ్యంరెడ్డి తదితరులు ఉన్నారు.

యువత స్వచ్ఛతాహీ సేవలో భాగస్వాములు కావాలి


విద్యార్థులకు ప్రోత్సాహక నగదు, సర్టిఫికేట్లను అందజేస్తున్న హరికృష్ణ, సుబ్బారెడ్డి

నాయుడుపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో యువత భాగస్వాములై నాయకత్వ పాత్ర పోషించాలని సమాచార ప్రసార మంత్రిత్వశాఖ సెంట్రల్ కమ్యూనికేషన్ బ్యూరో హరికృష్ణ అన్నారు. నాయుడుపేట విక్రమ్ కళాశాలలో గురువారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో డైరెక్టర్ కామిరెడ్డి సుబ్బారెడ్డి, సీడీపీవో ఉమామహేశ్వరి తదితరులతో కలసి మొక్కలు నాటారు. విద్యార్థులకు స్వచ్ఛతాహీ సేవా అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, ప్రోత్సాహక నగదు, సర్టిఫికేట్లను అందజేశారు.

వైభవంగా కోటి సోమవార పూజలు


శివాలయంలో కార్తీకదీపాలను వెలిగిస్తున్న భక్తులు

గూడూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు శివాలయాల్లో గురువారం కోటి సోమవార పూజలను ఘనంగా నిర్వహించారు. కార్తీకమాసంలో శ్రవణ నక్షత్రం వచ్చే రోజును పురస్కరించుకుని కోటి సోమవారం పూజలు నిర్వహించారు. మహిళలు స్థానిక శివాలయం, వీరభద్రస్వామి, సోమేశ్వరస్వామి తదితర ఆలయాల్లో కార్తీక దీపాలను వెలిగించి, స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపారు.

గూడలిలో..


గూడలిలో ఊరేగుతున్న కామాక్షిదేవి, సంగమేశ్వరుడు

కోట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలి కామాక్షిదేవి సమేత సంగమేశ్వర స్వామి ఆలయంలో గురువారం రాత్రి కోటి సోమవారం పూజలు జరిగాయి. ప్రధానార్చకుడు కార్తీక్‌శర్మ ఆధ్వర్యంలో సంగమేశ్వర మూలవిరాట్‌కు పలు అభిషేకాలు చేసి విశేష అలంకారంలో ఉంచారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక హోమాలు జరిగాయి. కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన మహిళలు ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సంగమేశ్వరుడు, కామాక్షిదేవి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను గూడలి పురవీధుల్లో శివనామస్మరణలతో ఊరేగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ప్రభుత్వ వసతిగృహ బాలికలకు రవాణా సౌకర్యం కల్పిస్తాం


మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీని కలిసిన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు తదితరులు

నాయుడుపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, జూనియర్ కళాశాలలో అభ్యసిస్తున్న బాలికల వసతి గృహానికి ఆయా విద్యాశాలలకు ఉచిత రవాణా సౌకర్యం ఏర్పాటు చేస్తామని మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ అన్నారు. నాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, వార్డెన్ హనుమంతరావు గురువారం మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విన్నమాలలోని తహసీల్దారు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వసతి గృహం నుంచి దాదాపు 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉన్నత పాఠశాలకు, జూనియర్ కళాశాలకు బాలికలు రావడానికి రైల్వే ట్రాక్‌ను దాటుకొని అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలియజేశారు. స్పందించిన రఫీ ఈ విషయం స్థానిక ఎమ్మెల్యే విజయశ్రీ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని, ఈలోపు తాత్కాలికంగా తన సొంత నిధులతో విద్యార్థినులను విద్యాలయాలకు పంపేలా రవాణా సౌకర్యం ఏర్పాటు చేస్తామన్నారు.

ప్రజాసమస్యలను పట్టించుకోవాలి

నాయుడుపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసేందుకు ప్రయత్నించే నాయకుల పట్ల పోలీసులు ప్రజాహితంగా పనిచేయాలని సీఐటీయు మండల కార్యదర్శి మహేష్, శివకవి ముకుంద అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాయుడుపేట పాత ట్రెజరీ కార్యాలయం ప్రాంతంలో పాత జీఎన్‌టీ రోడ్డు గుంతలమయంగా ఉందని, ఇది పట్టణానికి ప్రధాన రహదారికావడంతో పాటు మేనకూరు సెజ్‌కు వెళ్లే రహదారితో ప్రతిరోజు అధిక టన్నులతో వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయన్నారు. ఈ రహదారి గుంతలమయం కావడంతో ప్రభుత్వానికి నిరసన తెలియజేసేలా వరినాట్లు చేపట్టే కార్యక్రమాన్ని చేపట్టగా, పోలీసులు అడ్డుకొని నిలిపివేయడం అప్రజాస్వామికమన్నారు. సతీష్, వెంకయ్య, శాంతమ్మ తదితరులు ఉన్నారు.

గోతిలో వాలిపోయిన సిమెంట్ లారీ
● తృటిలో తప్పిన ప్రమాదం



కోట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కోట పట్టణ పరిధిలోని చల్లకాలువ వంతెన వద్ద గురువారం ఫైబర్ కేబుల్ కోసం తవ్విన గుంతలో పడి సిమెంట్ లారీ వాలిపోయింది. గూడూరు నుంచి సిమెంట్ లోడ్‌తో లారీ కోటకు వస్తూ చల్లకాలువ వంతెన గోతుల్లో ప్రమాదవశాత్తు ముందు చక్రాలు దిగబడిపోవడంతో ఒక్కసారిగా వాలిపోయింది. లారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్ చాకచక్యంగా బయటకు దూకేయడంతో పెను ప్రమాదం తప్పింది.

నేడు 2కెరన్

నాయుడుపేట టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా, పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా 2కెరన్‌ను నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహిస్తున్నట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. ఉదయం 6 గంటలకు నాయుడుపేట అమరావతి సెంటర్ వద్ద నుంచి సీఎస్‌తేజ సెంటర్ వరకు 2కెరన్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

● వెంకటగిరిటౌన్: అక్టోబరు 31న 2కే రన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీఐ ఏవీ రమణ తెలిపారు. ఉదయం 7గంటలకు క్రాస్ రోడ్డు నుంచి పాలకేంద్రం వరకు జరుగుతుందన్నారు.

వెంకటగిరిని డివిజన్ కేంద్రంగా చేయాలి

వెంకటగిరిటౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వెంకటగిరిని డివిజన్ కేంద్రంగా చేసేందుకు అన్ని వసతులు ఉన్నాయని వైసీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎన్‌జేఆర్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ గూడూరును నెల్లూరులో విలీనం చేసినప్పుడు వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి కేంద్ర డివిజన్‌ను ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

చిన్నారులపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

కోట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారుల పట్ల వర్కర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీడీపీవో మునికుమారి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం కోట, కొక్కుపాడు క్లస్టర్ అంగన్‌వాడీ కేంద్రాల వర్కర్లతో సమీక్ష జరిగింది. సీడీపీవో మాట్లాడుతూ వర్షాలు ఆగిపోయినందున చిన్నారులకు సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ కృష్ణమ్మ తదితరులు ఉన్నారు.

శిథిలావస్థలో బస్ షెల్టర్లు
● ఎండ, వానల్లో ప్రయాణికులకు అవస్థలు


రామాపురం, వెంకటరెడ్డిపల్లి వద్ద దుస్థితిలో నిరుపయోగంగా ఉన్న బస్ షెల్టర్లు

బాలయపల్లి, అక్టోబరు 30: ప్రయాణికుల సౌకర్యార్థం మండలంలో పదికి పైగా నిర్మించిన బస్ షెల్టర్లు శిథిలావస్థకు చేరుకోవడంతో నిరుపయోగంగా మారాయి. వెంకటరెడ్డిపల్లి, రామాపురం, అక్కసముద్రం, సంగవరం, పెరిమిడి, భైరవరం, బాలాయపల్లి తదితర ప్రాంతాల్లో నిర్మించిన బస్ షెల్టర్లు శిథిలావస్థకు కున్నాయి. ఈ షెల్టర్ల లోపల వేచి ఉండేందుకు వసతులు లేక, శ్లాబు పెచ్చులు ఊడి పడుతుండడంతో ప్రయాణికులు లోపలికి వెళ్లేందుకు సాహసించడం లేదు. దీంతో వారు బస్సుల కోసం ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ షెల్టర్ల బయట వేచి ఉంటున్నారు. లక్షలాది రూపాయలతో నిర్మించిన బస్ షెల్టర్లు కేవలం మందు బాబులకు అడ్డాగా మారాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్ షెల్టర్లను వినియోగంలోకి తీసుకువచ్చి ప్రయాణికుల అవస్థలు తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు.

మత్స్యకారులకు అండగా కూటమి ప్రభుత్వం
● ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ


బియ్యం, నిత్యావసరాలను అందజేస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ


తడ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు ఎప్పుడూ అండగా ఉండేది కూటమి ప్రభుత్వమేనని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. గురువారం సాయంత్రం భీములవారిపాళెం వద్ద మత్స్యకారులకు బియ్యం, నిత్యావసరాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఇందులో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ మొంథా తుఫాన్‌తో వేట లేక నష్టపోయిన మత్స్యకారులను ఆదుకునేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు 50 కేజీల బియ్యం, చక్కెర, కందిపప్పు, నూనె, ఉల్లగడ్డలు, ఉల్లిపాయలు అందించాలని ఆదేశించారన్నారు. వాటిని ఒక్కరోజులోనే ఆయా కుటుంబాలకు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. పునరావాస కేంద్రాలలో ఉన్న వరద బాధితులకు కుటుంబానికి రూ.3వేలు చొప్పున నగదు అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు శరత్‌బాబు, ఎంపీడీవో శేఖర్‌నాయక్, రాష్ట్ర బెస్త కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన శ్రీధర్, జడ్పీటీసీ ఇందుమతి, టీడీపీ నాయకులు పార్థసారథి, సెల్వం, బొమ్మన పళణి, పీఏసీఎస్ డైరెక్టర్లు సుధాకర్, రవి, జయపాల్, ఎఫ్‌బీవో మహిజ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు
● ఆర్డీవో కిరణ్మయి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దారు రాజేంద్ర

నాయుడుపేట టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్ఎస్ఆర్ కాలనీ రైల్వే గేట్ సమస్యపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపడుతామని సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి అన్నారు. ఎన్ఎస్ఆర్ కాలనీ రైల్వేగేట్ సమీపంలో గురువారం ఆర్డీవో ఆధ్వర్యంలో రెవెన్యూ, రైల్వే, మున్సిపల్ అధికారులతో జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశాన్ని కాలనీవాసులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ సుమారు 500 కుటుంబాలకు పైగా ఎన్ఎస్ఆర్ కాలనీలో 78వ రైల్వే గేట్ ద్వారానే రాకపోకలు సాగిస్తూ ఉండేవారమని, ఎటువంటి సమాచారం లేకుండా ఉన్న రైల్వే గేట్‌ను మూసివేయడంతో నానాఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. సుమారు 5 కిలోమీటర్ల మేర ప్రయాణించి పట్టణానికి చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొందని, ఇకనైనా రైల్వేగేట్‌ను పునరుద్ధరించాలని ఆర్డీవో ఎదుట వారు మొరపెట్టుకున్నారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ సమస్యలన్నీ ఉన్నతాధికారులకు నివేదిస్తామని, వారి ఆదేశాల మేరకు చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు రాజేంద్ర, మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, రైల్వే పీడబ్ల్యూడీ నజీర్, ఎస్‌ఐ ఆదిలక్ష్మి, రైల్వే పోలీసులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు కూరగాయల పంపిణీ


కూరగాయలు అందజేస్తున్న టీడీపీ నాయకుడు సూర్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు

చిల్లకూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలబల్లిరెట్టపల్లి గ్రామంలో తుఫాన్ కారణంగా ఇబ్బందులు పడుతున్న ఎస్టీకాలనీవాసులకు గురువారం స్థానిక టీడీపీ నాయకుడు మన్నే సూర్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో కూరగాయలు అందజేశారు. సూర్యనారాయణ మాట్లాడుతూ మొంథా తుఫాన్ కారణంగా ఎస్టీకాలనీవాసులు ఇబ్బందులు పడుతుండడంతో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, టీడీపీ సీనియర్ నేత తానంకి నానాజీ, టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి సూచనల మేరకు కూరగాయలను అందజేసినట్లు తెలిపారు. అబ్దుల్‌రెహమాన్, అన్వేష్, రమేష్, చంద్ర, సాయిరామ్, సుబ్రమణ్యం, మధు తదితరులు పాల్గొన్నారు

● గూడూరు అర్బన్: మండలంలోని దివిపాళెం, విందూరు గ్రామాల్లో, చిల్లకూరు మండలంలోని ఓడూరు, రెట్టపల్లి, కృష్ణపురం గిరిజనకాలనీ, తమ్మినపట్నం గ్రామాల్లో గురువారం గూడూరు ఏఎంసీ చైరపర్సన్ చిల్లకూరు నీరజ ఆధ్వర్యంలో తుఫాన్ బాధితులకు ఉల్లిపాయలు, ఉల్లగడ్డలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, సోమిశెట్టి చెంచురామయ్య, వేముల సునీల్, రాజేంద్ర, జగదీష్ బాబు, వేమచంద్రవర్మ, లక్ష్మి, వెంకయ్య, రవీంద్రరెడ్డి, వెంకటరమణయ్య, శేషయ్య, యశ్వంత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● డక్కిలి: మండలంలోని చాపలపల్లి గ్రామంలో తుఫాన్ బాధితులకు గురువారం డిప్యూటీ తహసీల్దారు ప్రసన్నరాణి, ఎంపీపీ గోను రాజశేఖర్ ఆధ్వర్యంలో నిత్యావసరాలను పంపిణీ చేశారు. డీటీ ప్రసన్నరాణి మాట్లాడుతూ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వం ప్రతి కుటుంబానికి 25 కిలోల బియ్యం, లీటరు వంటనూనె, కేజీ చక్కెర, పప్పు, బంగాళాదుంపలు అందించినట్లు తెలిపారు. రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరి నారుమడులకు తక్కువ మోతాదులో ఎరువులు


వరినారుమడులను పరిశీలిస్తున్న ఏవో సుచేంద్ర ప్రసాద్

కోట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా నీటమునిగిన వరి నారుమడులకు ఎలాంటి ఢోకాలేదని, ఎరువుల వాడకం మోతాదు తగ్గించాలని వ్యవసాయశాఖ అధికారి సుచేంద్రప్రసాద్ కోరారు. మండల పరిధిలోని తిన్నెలపూడి, తాటితోపు గ్రామాల్లో నీటమునిగిన వరినారుమడులను గురువారం ఆయన పరిశీలించారు. నీటిలో ఉన్న ఎకరం నారుమడికి బూస్టర్ డోస్‌లో భాగంగా ఒకటిన్నర కేజీల పోటాషియం, 2 కేజీల యూరియాను పిచికారి చేయాలన్నారు. అదే విధంగా ఒక లీటరు నీటికి ఒక గ్రాము కాంట్రాఫ్‌ను కలిపి రెండు ఎంఎల్ కలిపి పిచికారిచేసినట్లయితే వరి నారుమడులకు ఎలాంటి చీడపీడలు సోకవన్నారు. ఆయన వెంట వ్యవసాయ విస్తరణాధికారి సాయికుమార్, పలువురు సహాయ వ్యవసాయ అధికారులు, రైతులు ఉన్నారు.

రాజ్యాంగ దినోత్సవ పోటీలకు విద్యార్థుల ఎంపిక

నాయుడుపేట టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎల్ఎసాగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలస్థాయి పోటీలను గురువారం నిర్వహించారు. వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలను నిర్వహించి, ప్రతి విభాగం నుంచి ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేశారు. వారికి మరలా క్విజ్ పోటీలు నిర్వహించి, నియోజకవర్గస్థాయి పోటీలకు ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు మునిరత్నం, మాధవి, ప్రధానోపాధ్యాయురాలు మీనాకుమారి, ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, చెంచుకుమార్, సుభాష్, జి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మండల స్థాయి వ్యాసరచన పోటీలు

డక్కిలి, అక్టోబర్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎనిమిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలను గురువారం నిర్వహించారు. మండల స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా సన్మానించి, బహుమతులు అందచేశారు. వీరిని డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎంఈవో వెంకటేశ్వర్లు, జగదీష్‌బాబు తెలిపారు.

ఘనంగా గోపాష్టమి వేడుకలు

వెంకటగిరిటౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్దంపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోపాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం గోవులకు పూజలు నిర్వహించారు. అనంతరం విశ్వహిందూపరిషత్ ప్రఖండ అధ్యక్షుడు వెంకటశాస్త్రి మాట్లాడుతూ కార్తీకమాసంలో గోపూజ, గోదానం, గోసేవ కార్యక్రమాలు ఎంతో విశిష్టమైనవన్నారు. గోవులలో ముక్కోటిదేవతల ప్రతిరూపాలు ఉంటాయన్నారు. చిన్నతనం నుంచే పిల్లలకు గోవు విశిష్టను తెలియజేయాలన్నారు. మల్లికార్జున్, తులసీరామ్, హనుమంతు, ఋషి, శ్రీనివాసులు, రవి, రవీంద్ర, మురగయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్యకళాశాలల ప్రైవేటీకరణ వద్దు: వైసీపీ


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి

ఓజిలి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వద్దని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు కోటి సంతకాల కార్యక్రమం చేపట్టామన్నారు. మండల పార్టీ కన్వీనరు పాదర్తి హరినాథరెడ్డి ఆధ్వర్యంలో ఓజిలిలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గం నుంచి 60 వేల మందితో సంతకాలు చేయిస్తామన్నారు. ఎంపీపీ అరుణమ్మ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, జిల్లా అధికారప్రతినిధి కొండూరు వెంకటసుబ్బరాజు, సీనియర్ నాయకులు కొండూరు దామోదర్‌రాజు, ప్రభాకర్ రాజు, గోపాలయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.

● పెళ్లకూరు: మండలంలోని రోసనూరులో వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ గురవారం జరిగిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా, మండల కన్వీనర్ ఓబ్బు వెంకటరత్నం, నాయకులు ఎల్లు మోహన్, సాగి జితేంద్ర, బండి బాలు, అట్ల కృష్ణ, మునిరాజ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషిచేయాలి


ఆర్ఎస్ఎస్ ఏపీ సంఘటన మంత్రి మధుకర్‌జీని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

గూడూరు, అక్టోబరు 30 (ఆంధ్ర జ్యోతి): నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేస్తూ బీజేపీ బలోపేతానికి కృషిచేయాలని ఆర్ఎస్ఎస్ ఏపీ సంఘటన మంత్రి మధుకర్‌జీ అన్నారు. గురువారం స్థానిక రైల్వేస్టేషన్‌కు విచ్చేసిన ఆయనను బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో పేదలకు చేరువ చేసేలా కష్టపడి పనిచేయాలన్నారు. పాపారెడ్డి పురుషోత్తంరెడ్డి, ఆరికట్ల బాలకృష్ణమనాయుడు, దయాకర్, సురేష్‌బాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవం

గూడూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జాతీయ ఐక్యతా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఐక్యతాదినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఐక్యతా దినోత్సవ ప్రతిజ్ఞను చేపట్టారు. డాక్టర్ పీర్‌కుమార్, కోటేశ్వరరావు, విజయమహేష్, నారాయణరాజు, శైలజ, ఝాన్సీవాణి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

సూళ్లూరుపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని బాలాజి ప్రిటింగ్ ప్రెస్ నిర్వాహకులు అంజూరు సుబ్రహ్మణ్యం(60) (గోపాల్) మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం మృతి చెందారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, టీడీపీ నాయకులు ఆయన భౌతికాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

గూడూరు అర్బన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు అన్నారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ శుక్రవారం స్థానిక టవర్‌క్లాక్ కేంద్రం వద్ద జరిగే ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని కార్మికసంఘాలు విజయవంతం చేయాలన్నారు. నారాయణ, శశికుమార్, సునీల్, జమాలుల్లా తదితరులు పాల్గొన్నారు.

మార్పులకనుగుణంగా విద్యాబోధన చేయాలి

కోట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం విద్యారంగంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా విద్యాబోధన చేయాలని ఎంఈవోలు శిరీషా, మస్తానయ్య కోరారు. కోటలోని విద్యావనరుల కేంద్రంలో గురువారం విద్యాబోధనపై స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో సమీక్ష జరిగింది. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న కార్పొరేట్‌స్థాయి విద్యపై ప్రచారం చేయాలన్నారు.